హైదరాబాద్ వార్త

# ప్రారంభమైన ఇంటర్ పరీక్షలు

## -తొలిరోజు హాజరైన 84032 మంది విద్యార్థులు -2913 మంది పరీక్షలకు దూరం








**హైదరాబాద్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** జిల్లాలో ఇంటర్ మొదటిసంసవత్సరం వార్షిక పరీక్షలు ప్రారంభమయ్యాయి. ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు పరీక్షలు జరిగాయి. పరీక్ష కేంద్రాలకు విద్యార్థులు ఉదయం 8గంటలకే చేరుకుని సకాలంలో పరీక్షలకు హాజరైనట్లు అధికారులు చెప్పారు. అధికారులు బస్సులు సకాలంలో నడపడంతో విద్యార్థులు ఇబ్బందులు లేకుండా పరీక్ష హాల్‌కు చేరుకున్నారు. ప్రతి కేంద్రంలో విద్యార్థులకు పరీక్ష రాసుకోవడానికి టేబుళ్ల ఏర్పాటు ,త్రాగునీటిని సౌకర్యం వంటి మౌళికసదుపాయాలను అందుబాటులో ఉంచారు. జంట నగరా పరిధిలో 217 పరీక్ష సెంటర్లు ఏర్పాటు చేశారు. బుధవారం జరిగిన ప్రథమ సంవత్సర పరీక్షకు 86945 మంది విద్యార్థులు హాజరుకావాల్సి ఉండగా, 84032 మంది విద్యార్థులు పరీక్షలు రాసినట్లు వివరించారు. జనరల్ 80,254, వొకేషనల్ విద్యార్థులు 3778 మంది హాజరయ్యారని, ఈపరీక్షకు జనరల్ విద్యార్థులు 2738మంది ,వొకేషనల్ విద్యార్థులు 175మంది మొత్తం 2913మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకాలేదని తెలిపారు. అలాగే ఎక్కడా మాల్ ప్రాక్టీస్ కేసులు పట్టుబడలేదని . పరీక్షా కేంద్రాలవద్ద హెచ్ సిపి 03,డిఈసి 06, స్క్వాడ్ 29, డిఐఈఓ 04 మంది అధికారులు తనిఖీలు చేసినట్లు వెల్లడించారు. అ లాగే పరీక్షల కు హాజ రయ్యే విద్యార్థులు ఇబ్బందులు పడకుండా రద్దీగా ఉండే ఎల్బీనగర్, ఉప్పల్, సికింద్రాబాద్, కూకట్‌పల్లి,కెపిహెచ్‌బి కాలనీ ట్రాఫిక్‌లో చిక్కుకున్న విద్యార్థులకు విద్యార్థి సంఘాల నాయకులు సాయం చేశారు. రద్దీగా ఉండే ప్రాంతాల్లో రంగంలోకి దిగి ట్రాఫిక్ క్లియర్‌చేయడంతో విద్యార్థులకు సకాలంలో పరీక్షా కేంద్రాలకు చేరుకోవడంలో సహాయ పడ్డారు. దీంతో విద్యార్థుల తల్లిదండ్రులతోపాటు ట్రాఫిక్ పోలీసులు సైతం వారిని అభినందించారు.

**విద్యార్థినిని బైక్‌పై సెంటర్‌వద్ద దింపిన కానిస్టేబుల్..**
రాష్ట్రవ్యాప్తంగా బుధవారం నుంచి ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయి. తొలి రోజు పరీక్ష కేంద్రాలకు వెళ్లే విద్యార్థులు హడావుడితో ఇబ్బందులు పడుతుంటారు. ఈ విషయాన్ని గ్రహించిన జీడిమెట్ల ఇన్స్పెక్టర్ గడ్డం మల్లేశ్ పరీక్ష కేంద్రాల వద్ద ప్రత్యేకంగా సిబ్బందిని కేటాయించారు. ఓ విద్యార్థికి చింతల్‌లోని వాగ్దేవి కళాశాలలో పరీక్ష కేంద్రం ఉంది. కానీ ఆమె భాగ్యరథి కళాశాలకు వెళ్లారు. ఈ విషయాన్ని గ్రహించిన కానిస్టేబుల్ రఫీ వెంటనే తన ద్విచక్ర వాహనంపై విద్యార్థినిని ఆ పరీక్ష కేంద్రం వద్దకు తీసుకెళ్లారు.

# పారిశుధ్య నిర్వాహణలో నిర్లక్ష్యం సహించేది లేదు

**-ప్రతి రోజూ తప్పనిసరిగా డోర్‌టుడోర్ చెత్త సేకరణ చేయాలి**
**-జిహెచ్ఎంసి కమిషనర్ ఆర్.వి.కర్ణన్**


స్థానికులతో మాట్లాడుతున్న కమిషనర్ ఆర్.వి.కర్ణన్,జోనల్ కమిషనర్ రవికిరణ్ తదితరులు

**హైదరాబాద్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** ప్రతి రోజూ తప్పనిసరిగా డోర్‌టుడోర్ చెత్త సేకరణ చేపట్టేలా పర్యవేక్షణ చేయాలని జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్ అధికారులను ఆదేశించారు. బుధవారం జోనల్ కమిషనర్ రవి కిరణ్ తో కలిసి ఇందిరా పార్క్ గాంధీ నగర్ నుండి సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ వరకూ జీహెచ్ఎంసీ కమిషనర్ ఆర్ వి కర్ణన్.పారిశుధ్య తనిఖీలు చేపట్టారు. సురభి పార్క్, పి అండ్ టి కాలనీ, గాంధీనగర్ డివిజన్, కవాడిగూడ ,సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ సమీప ప్రాంతాలలో కమిషనర్ ఆర్‌వి కర్ణన్ తనిఖీలు చేపట్టారు. క్షేత్ర స్థాయిలో స్వచ్ఛ ఆటో ల హాజరు, రెగ్యులర్ పారిశుద్ధ్య కార్యకలాపాలను కమిషనర్ క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. స్వచ్ఛ ఆటో పారిశుద్ధ్య కార్మికులు ప్రతి రోజూ తప్పనిసరిగా డోర్‌టుడోర్ చెత్త సేకరణ చేసేలా పర్యవేక్షణ చేయాలని డిప్యూటీ కమిషనర్లు , సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ డీఈఈ, ఏఈ లను కమిషనర్ ఆర్ వి కర్ణన్ ఆదేశించారు. పబ్లిక్ ప్లేస్‌లు, పార్క్‌లు, రహదారులు,రోడ్లు, జంక్షన్‌లు పరిశుభ్రంగా ఉండేలా ఫోకస్ పెట్టాలని కమిషనర్ సూచించారు. పారిశుద్ధ్య పర్యవేక్షణలో నిర్లక్ష్యాన్ని సహించేది లేదని కమిషనర్ స్పష్టం చేశారు. నిరంతరం అప్రమత్తంగా ఉంటూ గ్రేటర్ హైదరాబాద్ నగరాన్ని పరిశుభ్ర నగరంగా తీర్చిదిద్దాలని కమిషనర్ కోరారు.

## పనిమనిషి దొంగతనం బండారం బట్టబయలు

**- 95.4 గ్రాముల బంగారం, పది వేల నగదు స్వాధీనం**


చోరి చేసిన వస్తువులను చూపిస్తున్న పోలీస్ అధికారులు

**తార్నాక, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** ఉస్మానియా యూనివర్సిటీ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకున్న దొంగతనం కేసులో ఇంటి పనిమనిషిని అరెస్ట్ చేసి, అపహరించిన 95.4 గ్రాముల బంగారు ఆభరణాలు మరియు రూ.10 వేల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసిన ఆస్తి మొత్తం విలువ సుమారు రూ.3,88,000గా పోలీసులు తెలిపారు. ఓ. యూ ఏసీపీ జగన్, ఇన్స్‌పెక్టర్ మహేష్ కథనం ప్రకారం. హబ్సిగూడ గ్రీన్ హిల్స్ కాలనీ, చెందిన రిటైర్డ్ శాస్త్రవేత్త డా. పి.ఎల్.కె.ఎం. రావు (79) ఇంట్లో పనిచేస్తున్న అలమ్ తేజస్వి (43) అనే మహిళ ఈ దొంగత నానికి పాల్పడింది. ఆమె స్వస్థలం నాగర్ కర్నూల్ జిల్లా, ఆచంపేట మండ లం కొండనగుల గ్రామం. ఆర్థిక ఇబ్బందులు, అప్పుల కారణంగా ఈ నేరానికి పాల్పడినట్లు విచారణలో వెల్లడైందని తెలిపారు. ఇంటి పనిమనిషిగా చేరిన తేజస్వి, యజమానుల విశ్వాసాన్ని పొందిన తర్వాత ఇంటిని శుభ్రపరిచే పనుల సమయంలో బంగారు గొలుసులు, గాజులు, ఉంగరాలు, చందరహారం తదితర ఆభరణాలను దొంగిలించినట్లు పోలీసులు తెలిపారు. యజమానులకు అనుమానం రాకుండా ఉండేందుకు అప్పుడప్పుడు ఒక్కక్క టిగా బంగారు వస్తువులను చోరి చేస్తూ వస్తోంది. దీంతో ఇంటి యజమాని ఫిర్యాదు అందుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టి ఫిబ్రవరి 25 ఉదయం హబ్సిగూడ బస్ స్టాప్ వద్ద నిందితురాలిని అదుపులోకి తీసుకున్నారు. అనంతరం అదే రోజు ఉదయం 11:30 గంటలకు ఆమెను అధికారికంగా అరెస్ట్ చేసి, న్యాయస్థానంలో హాజరుపరిచారు.ఈ కేసును సబ్‌ఇన్‌స్పెక్టర్ పి. కరుణాకర్ ఆధ్వర్యంలో సిబ్బంది దర్యాప్తు చేస్తున్నారు. ఇన్‌స్పెక్టర్ మ హేష్ పర్యవేక్షణలో, అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ జగన్ మార్గద ర్శకత్వంలో మరియు డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్ సికింద్రాబాద్ జోన్ పర్యవేక్షణలో అరెస్ట్ నిర్వహించినట్లు పోలీసులు తెలిపారు. ఈ కేసులో మంచి ప్రతిభకనబరిచిన హెడ్ కానిస్టేబుల్ సత్యనారాయణ, కానిస్టేబుల్లు కె.విజయ్‌కుమార్, డి.వెంకటేష్, ప్రియాంక, చెరుకుపల్లి ప్రియాంక తధితరులకు ఏసిపి జగన్ నగదు ప్రోత్సాహక భహుమతిని అందజేశారు.

## ఐదో తరగతి విద్యార్థి బలవన్మరణం

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్తః** అయిదో తరగతి చదువుతున్న ఒక విద్యార్థి బలవన్మరణానికి పాల్పడిన సంఘటన బంజారాహిల్స్ ఠాణా పరిధిలో చోటుచేసుకొంది. బంజారాహిల్స్ పోలీసుల కథనం ప్రకారం.. బంజారాహిల్స్‌లోని ఫస్ట్ లాన్సర్ సయ్యద్ నగర్ ప్రాంతానికి చెందిన ఇర్ఫాన్ ఖాన్ కుమారుడు మహ్మద్ అఫ్ఫాన్ ఖాన్(12) అయిదో తరగతి చదువుతున్నాడు. మంగళవారం ఇర్ఫాన్‌ఖాన్ తన భార్యతో కలిసి బంధువుల అంత్యక్రియలకు వెళ్లారు. కాగా ఇంట్లో ఉన్న బాలుడు ఇంట్లో ఉన్న సీలింగ్ రాడ్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ విషయాన్ని గుర్తించిన అతని సోదరి వెంటనే ఆసుపత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు అప్పటికే అతను మృతిచెందినట్లు రాత్రి 12.55కు తేల్చిచెప్పారు. ఈ మేరకు మృతుడి తండ్రి ఇర్ఫాన్ ఖాన్ బంజారాహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. మృతిపై ఎలాంటి అనుమానాలు లేవని ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే పోలీసులు ప్రాథమికంగా అనుమానస్పద మృతి కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరోవైపు అయిదో తరగతి చదువుతున్న విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం వెనుక గల కారణాలను పోలీసులు అన్వేషిస్తున్నారు

## బిసిలపై దాడులు ఆపకపోతే ఉద్యమం తప్పదు

**-రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య**


ప్రసంగిస్తున్న బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య

**హైదరాబాద్ ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** రాష్ట్రంలో బీసీలపై జరుగుతున్న అగ్రవర్ణాల దాడులను అరికట్టడంలో ప్రభుత్వం విఫలమైతే పెద్ద ఎత్తున తిరుగుబాటు తప్పదని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హెచ్చరించారు. నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మర గ్రామంలో మల్లన్న జాతర సందర్భంగా రజక కుటుంబంపై జరిగిన దాడిలో రెండు నెలల పసిపాప మృతి చెందడంపై ఆయన తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. బుధవారం విద్యానగర్ బిసి భవన్ లో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ ఘటనకు బాధ్యులైన వారిని వెంటనే అరెస్ట్ చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. బాధితులకు న్యాయం చేయాలని కోరుతూ బీసీ సంఘాల ఆధ్వర్యంలో జరుగుతున్న దీక్షలకు ఆయన మద్దతు ప్రకటించారు. గతంలో జరిగిన కారంచేడు, చుండూరు ఘటనలను ఈ దారుణం గుర్తు చేస్తోందని, ప్రభుత్వం తక్షణమే స్పందించి సిట్ ద్వారా విచారణ జరిపించాలని కోరారు. ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం తరహాలోనే కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతల వైఫల్యానికి బాధ్యత వహిస్తూ సీఎం రేవంత్ రెడ్డి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. అదే విధంగా హత్యకు గురైన చిన్నారి కుటుంబానికి రూ. 1 కోటి ఎక్స్‌గ్రేషియా, ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం మరియు డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కేటాయించాలి, నిందితులను వెంటనే అరెస్ట్ చేసి కఠినంగా శిక్షించడంతో పాటు బి.సి వర్గాలకు ప్రత్యేక రక్షణ చట్టం తీసుకురావాలి డిమాండ్ చేసారు. ఈ దాడులు ఇలాగే కొనసాగితే కులాల మధ్య వైషమ్యాలు పెరిగి అంతర్యుద్ధం వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరించారు.

## కన్నుల పండుగగా స్వామి వారి చక్రస్నానం


వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి చక్రస్నానం.

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్తః** జూబ్లీహిల్స్‌లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల్లో భాగంగా బుధవారం స్వామివారి ఉత్సవమూర్తికి చక్రస్నానం నిర్వహించారు. ఆలయ వేదపండితుల మంత్రోచ్ఛారణలు, అశేష భక్తజనుల మధ్య ఈ వేడుకను అత్యంత కన్నుల పండుగగా నిర్వహించారు. ఆలయ కొలనులో స్వామి వారి విగ్రహ మూర్తులకు చక్రస్నానం నిర్వహించారు. రాత్రి ధ్వజారోహణం కార్యక్రమాన్ని సైతం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎల్‌ఏసీ అధ్యక్షుడు ఏవి రెడ్డి, ఆలయ ఏఈఓ రమేష్, ఆలయ ఇన్‌స్పెక్టర్ నిరంజ న్‌కుమార్, అధికారులు,ఆలయ అర్చకులు, పాల్గొన్నారు.

# 'మినరల్' దందా షురూ!

**-నగరంలో పుట్టగొడుగుల్లా వాటర్‌ప్లాంట్లు**
**-బోరు నీటినే ప్యూరిఫైడ్ చేసి విక్రయాలు**
**-నాణ్యతలేమితో ప్రజారోగ్యంతో చెలగాటం**
**-చోద్యం చూస్తున్న అధికార యంత్రాంగం**



**హైదరాబాద్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** వేసవి వచ్చిందంటే చాలు నగరంలో మినరల్ వాటర్ పేరుతో కోట్లలో వ్యాపారం జరుగుతోంది. అయితే మినరల్ వాటర్ పేరు చెప్పి అమ్మకాలు చేసే నీటిలో మినరల్స్ మాట దేవుడెరుగు కనీసం తాగడానికి పనికొచ్చేపరిస్థితి కూడా లేదని నిపుణులు చెబుతున్నారు.కేవలం బోరు నీటిని ప్యూరిఫయర్ల ద్వారా శుద్ధిచేసి విక్రయాలు జరుపుతున్నారు. ప్యూరిఫయర్ల ద్వారా నీటిలో ఉండే బ్యాక్టీరియా తొలిగిపోదని అధికారులు చెబుతున్నారు. అయినా వాటినే ఎంచక్కా అమ్మేస్తున్నారు. నగరంలో వివిధ రకాల పేర్లతో ప్యాకేజ్ డ్రింకింగ్ వాటర్( దీనిని కొందరు తయారీ దారులు మినరల్ వాటర్ అంటున్నారు)ను విక్రయిసు_న్నారు. వీటిలో నాణ్యత లేకపోవడంతో డయేరియా, జాండీస్ వంటి ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం పొంచి ఉంది.వేసవి కాలంలో ఒక్క హైదరాబాద్ నగంలోనే రోజుకు దాదాపు 7కోట్ల నీటివ్యాపారం జరుగుతున్నట్లు అంచనా వేస్తున్నారు. నగరశివారు ప్రాంతాలైన చర్లపల్లి,మల్లాపూర్, కూకట్‌పల్లి, కుత్బుల్లాపూర్,కాటేదాన్,రాజేంద్రనగర్,హయత్‌నగర్,వనస్థలిపురం, మియాపూర్ తదితర ప్రాంతాల్లో రోజురోజుకూ వాటర్‌ప్లాంట్లు పుట్టగొడుగుల్లా వెలుస్తున్నాయి. ఇప్పటివరకు గ్రేటర్‌లో సుమారు 2వేలకు పైగా వాటర్‌ప్లాంట్‌లు కొనసాగుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. మినరల్ వాటర్ పేరుతో మార్కెట్లో లభించే నాణ్యత లేని బాటిల్ వాటర్‌ను తాగడం వల్ల వివిధ రకాల వ్యాధుల బారిన పడే అవకాశం అధికంగా ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.కాలుష్యపు నీటితోనే అధిక శాతం వ్యాధులు వస్తున్నాయని తెలుపుతున్నారు. పైకి స్వచ్ఛతతో ఉన్నట్లు కనిపించినా అందులో బాక్టీరియా ఉంటున్నట్లు ఐపీఎం అధికారులు పరీక్షల్లో స్పష్టమవుతోంది. ఇటువంటి నీటిని తాగడం వల్ల ఎసిడిటీ సమస్యలు డయేరియా, జాండీస్ వంటివి వ్యాధులు ప్రభలే ప్రమాదం ఉందని అధికారులు హెచ్చరిస్తున్నారు. అధిక శాతం ప్లాంట్‌లు బోరునీటినే వినియోగిస్తున్న నేపథ్యంలో అందులో ఫ్లోరైడ్ పాళ్లకూడా కనిపిస్తుననట్లు తెలుపుతున్నారు. నిర్ణీత ప్రమాణాల కంటే ఫ్లోరైడ్ అధికంగా ఉన్నా ప్రమాదమే..లీటర్ నీటిలో 1మిల్లీ గ్రాము కంటే తక్కువగా ఉండాలి.కానీ ప్రస్తుతం మార్కెట్లో విక్రయించే నీటిలో ఇవేవీ ప్రమాణాలకు సరిపోయేంత ఉండటంలేదని అంటున్నారు.

**నాసిరకం డబ్బాలలతో సరఫరా..**
బీఐఎస్ ప్రమాణాల ప్రకారం నీటిని నింపే డబ్బాలు ,క్యాన్లు పాలిథిన్,పాలి వినైల్ క్లోరైడ్,పాలిప్రొపిలిన్‌తో తయారైన వాటినే వినియోగించాలి. కానీ ధర ఎక్కువవుతుందనే కారణంతో నాసిరకం డబ్బాలలో నీటిని సరఫరా చేస్తున్నారు.ఈతరహా ప్లాస్టిక్ బాటిల్స్‌లో బ్యాక్టీరియా త్వరగా వృద్ధి చెందేందుకు ఆస్కారం ఉంటుందని వైద్యులు తెలుపుతున్నారు. పునర్వినియోగించే ప్లాస్టిక్ డబ్బాలను బీపీఏ ఫ్రీ ప్లాస్టిక్‌తో తయారు చేయాలి. ఇవన్నీ తెలియని వినియోగదారులు నీటిపేరుతో అనారోగ్యాన్ని కొనుగోలు చేస్తున్నారని అంటున్నారు.

**పాటించాల్సిన నిబంధనలు..**
నిజంగా ప్యాకేజ్డ్ డ్రింకింగ్ వాటర్‌ప్లాంట్‌లను ఏర్పాటు చేయాలంటే తప్పని సరిగా బీఐఎస్ నుండి లైసెన్స్ పొందాల్సి ఉంటుంది.తయారు చేసే కంపెనీ చిరునామా ఏపద్దతిలో నీటిని శుద్ధి చేస్తున్నారన్న దానిని కచ్చితంగా ప్యాకింగ్‌పై ముద్రించాల్సి ఉంటుంది. నీటిని నిర్ణీత ప్రమాణాలకు అనుగుణంగా శుద్ధి చేయాల్సి ఉంటుంది. నిబంధనల ప్రకారం ప్లాంట్ ఏర్పాటు చేయాలంటే సుమారు 30లక్షల ఖర్చు అవుతుంది.కానీ కేవలం 3-4లక్షల ఖర్చుతోనే వీటిని ఏర్పాటు చేస్తున్నారు. బీఎస్ఐ లైసెన్స్ గల వాటర్ ప్లాంట్‌లో అధికారులు నెలకు కనీసం రెండుసార్లైనా తనిఖీలు నిర్వహిచాలి. నీటిని శుద్ధి చేసే యంత్రాలు, విశాలమైన గదులు,ల్యాబ్ టెక్నీషియన్లు, మైక్రోబయాలజిస్టులను సమకూర్చుకోవాలి.

**పత్తాలేని అధికార యంత్రాంగం..**
ప్రజారోగ్యంతో ముడపడి ఉన్న నీళ్లవ్యాపారంపై తరుచూ తనిఖీలు నిర్వహించాల్సిన అధికారులు కాసులకు దాసోహమై ప్రజల ప్రాణాలనే ఫణంగా పెడుతున్నారు.అక్రమ దారిలో ప్లాంట్ల యాజమాన్యాలు ఎరవేసే డబ్బులకు కక్కుర్తిపడి అటువైపు చూడకుండానే అన్నీ సక్రమంగా ఉన్నాయంటూ చేతులు దులుపుకుంటుండటంతో ప్రజలు రోగాల పాలవుతున్నారు. ఇబ్బడిముబ్బడిగా అనుమతి లేకుండా ఏర్పాటు చేసిన నీటిప్లాంట అను తనిఖీ చేసి వాటి ఆట కట్టించాల్సిన అధికారులు చూసీ చూడనట్లుగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు విని పిస్తున్నాయి.సంబంధిత అధికారులు ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

# రెండో విడత 14 చెరువుల అభివృద్ధి

**-ఎఫ్‌టిఎల్ ఎక్కడా తగ్గకుండా చూసుకోవాలి**
**-పనులను వేగంగా పూర్తి చేయాలి**
**-అధికారులకు హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఆదేశం**


చెరువును పరిశీలిస్తున్న హైడ్రా కమిషనర్ రంగనాథ్

**హైదరాబాద్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** నగరంలో చెరువుల అభివృద్ధిని వేగం చేయాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. చెరువులలో మురుగు నీటిని వెంటనే తొలగించాలని సూచించారు. చెరువు ఎఫ్‌టీఎల్ పరిధి ఎక్కడా తగ్గకుండా చూడాలన్నారు. రామచంద్రాపురంలోని గంగారం చెరువుతో పాటు.. ఈర్ల చెరువును కమిషనర్ రంగనాథ్ బుధవారం క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. హైడ్రా రెండో విడత చేపడుతున్న14 చెరువులలో ఈ రెండు చెరువులు కూడా ఉన్నాయనే విషయం గుర్తుచేశారు. వరద కాలువ ద్వారానే కాకుండా... నేరుగా మురుగు వివిధ ప్రాంతాల్లో చెరువులోకి ప్రవేశించడం, గుర్రపు డెక్కతో చెరువులు దుర్గంధభరితంగా మారడానికి గల కారణాలను పరిశీలించారు. చెరువుల్లోకి నేరుగా మురుగు నీరు చేరకుండా తీసుకోవాల్సిన చర్యలపై సమీక్షించారు. మురుగు కాలువలన్నిటినీ అనుసంధానం చేసి ఎస్‌టీపీ (మురుగునీటి శుద్ధి కేంద్రం) వద్ద ట్రీట్ అయిన తర్వాతే చెరువులోకి చేరేలా ఏర్పాట్లు చేయాలన్నారు.

**ఎఫ్‌టీఎల్ తగ్గొద్దు..**
గంగారం చెరువు 111 ఎకరాల మేర విస్తరించి ఉంది. అలాగే ఈర్ల చెరువు 32 ఎకరాల వరకూ ఉంది. ఈ చెరువుల ఎఫ్‌టీఎల్ పరిధిలు ఎట్టి పరిస్థితు ల్లోనూ తగ్గవద్దని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అధికారులను ఆదేశించారు. బఫర్ జోన్‌తో పాటు..చెరువుల వద్ద ఉన్న ప్రభుత్వ భూమిని కూడా కాపాడా లన్నారు. పార్కులు, పిల్లల ప్లే ఏరియాలు, అన్ని వయసులవారు సేద దీరేలా సీటింగ్ ఏర్పాట్లు అన్నీ అందుబాటులోకి రావాలని సూచించారు. చెరువుచుట్టూ ఎత్తుగా పెరిగి నీడనిచ్చే చెట్లను కూడా పెంచేందుకు అవస రమైన స్థలం ఉండేలా చూడాలని సూచించారు. చెరువుల్లోకి మురుగు నీరు నేరుగా చేరకుండా ఎస్‌టీపీలు ఏర్పాటుకు, మురుగు నీరు సెడిమెంటేషన్ పాండ్ నిర్మాణానికి అవసరమైన స్థలం ఉండేలా చూసుకోవాలని సూచించా రు. ఈపర్యటనలో హైడ్రా అడిషనల్ డైరెక్టర్ వర్లపాపయ్య తో పాటు పలువురు అధికారులు ఉన్నారు.

## రోడ్డు కబ్జాను తొలగించిన జిహెచ్ఎంసి,హైడ్రా అధికారులు


లిటిల్ బేగంపేటలో రోడ్డు ఆక్రమించి నిర్మించిన కట్టడాన్ని కూల్చివేస్తున్న జీహెచ్ఎంసీ, హైడ్రా

**బేగంపేట, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** బేగంపేట ప్రకాశంనగర్ లిటిల్ బేగంపేట కాలనీ ఉత్తర దిశ రోడ్డు ను ఆక్రమిస్తూ కొందరు కబ్జా రాయుళ్లు సిమెంట్ ఇటుకలతో గోడ నిర్మాణాన్ని చేసారు.ఈ విషయంపై కాలనీ వాసులు ఫిబ్రవరి 5న బీజేపీ నాయకుల దృష్టికి తీసికెళ్లడంతో కాలనీలో ఆక్రమణకు గురైన రోడ్డు స్థలాన్ని మాజీ ఎమ్మెల్యే మర్రిశశిధరరెడ్డి,బీజేపీ నాయకులు నెమలి ఆనంద్‌లు సందర్శించి పరిశీలించారు.ఈ విషయాన్ని మర్రి ఉన్నతాధికారుల దృష్టికి తీసికెళ్లి రోడ్డును ఆక్రమిస్తూ నిర్మించిన నిర్మాణాన్ని వెంటనే తొలగించాలని కోరారు.ఈ మేరకు అధికారులు జీఓఎంఎస్ 191 ప్రకారం డిమాలిషన్ ఆర్డర్ జారీ చేసారు.బుధవారంమధ్యాహ్నం జేసీబీలు,హైడ్రా సిబ్బందితో సహా కబ్జా ప్రాంతానికి చేరుకున్నారు.రోడ్డును ఆక్రమిస్తూ నిర్మించిన కట్టడాన్ని పూర్తిగా నేలమట్టం చేసారు.ఈ స్థలంలో రూఫ్ షెడ్ లు నిర్మించిన కబ్జా దారులు కాలనీ వాసులకు తీవ్ర ఇబ్బందులు కలిగించారు.ఈ విషయాన్ని కాలనీ వాసులు అధికారుల దృష్టికి తీసికెళ్లి నెలల సమయం తిరిగినా స్పందన లేకపోవడంతో కాలనీ ప్రజలు తీవ్ర ఆందోళణకు గురయ్యారు.ఈ విషయాన్ని కాలనీ వాసులు సికింద్రాబాద్ మహంకాళీ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్ (నందూ) దృష్టికి తీసుకు పోయారు.ఆనంద్ ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే,బీజేపీ జాతీయ కౌన్సిల్ సభ్యుడు మర్రి శశిధరరెడ్డి దృష్టికి తీసుకెళ్లారు.విషయం తెల్సుకున్న మర్రి రోడ్డు కబ్జాకు గురైన ప్రాంతానికి చేరుకుని కాలనీ వాసులతో చర్చించారు.ఈ విషయాన్ని అక్కడి నుంచే జీహెచ్ఎంసీ,హైడ్రా అధికారుల దృష్టికి తీసికెళ్లారు. వారు వెంటనే ఆ స్థలానికి చేరుకుని అక్కడ ఉన్న వారికి కొంత సమయం ఇచ్చారు.సమయం దాటి పోవడంతో బుధవారం అధికారులు పోలీసులతో వచ్చి రోడ్డు ఆక్రమిస్తూ చేపట్టిన నిర్మాణాలను కూల్చివేసారు.దీంతో లిటిల్ కాలనీ వాసులు మాజీ ఎమ్మెల్యే మర్రిశశిధరరెడ్డి,సికింద్రాబాద్ మహంకాళీ జిల్లా బీజేపీ ప్రధాన కార్యదర్శి నెమలి ఆనంద్ (నందు)లకు కృతజ్ఞతలు తెలియజేసారు.ఈ సందర్భంగా నెమలి ఆనంద్ మాట్లాడుతూ బీజేపీ ఎప్పుడూ ప్రజల సమస్యల పరిష్కారం కోసం చేసే పోరాటంలో ముందుంటుందని, మర్రి శశిధరరెడ్డి సహకారంతో సమస్య పరిష్కారం కావడంపై స్థానికుల సం తోషంగా ఉన్నారన్నారు.ప్రజా సమస్యల పరిష్కారంలో చొరవ చూపిన జీహెచ్ఎంసీ ,హైడ్రా అధికారులు,పోలీసులకు నెమలి ఆనంద్ కృతజ్ఞతలు తెలియజేసారు.

## డిప్యూటీ ఈవో సుకన్యకు టిఆర్‌టిఎఫ్ సన్మానం



డిప్యూటీ ఈవో సుక్యను సన్మానిస్తున్న టీఆర్‌టీఎఫ్ నేతలు

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** పాతబస్తీ బహదూర్‌పురా జోన్ ఉప విద్యాశాఖాధికారిగా ఇటీవల బాధ్యతలు చేపట్టిన డి.సుకన్యను తెలంగాణ రాష్ట్ర టీచర్స్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) హైదరాబాద్ జిల్లా శాఖ అధ్వర్యంలో కమిటీ ఘనంగా సన్మానించింది. టిఆర్‌టిఎఫ్ హైదరాబాద్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు డాక్టర్ శ్రీవాటి శ్రీనాథ్, డాక్టర్ ఎస్.విజయ భాస్కర్లు దారుల్‌షిఫాలోని డిప్యూటీ ఈవో కార్యాలయంలో సుకన్యను కలుసుకొని పుష్పగుచ్ఛం, శాలువతో సన్మానించి ఆ సంఘం 2026 డైరీని అందజేశారు.కార్యక్రమంలో టీఆర్‌టీఎఫ్ జిల్లా కోశాధికారి సగరం మీనా కుమారి, నేతలు సునంద, టి.జె.శ్రీధర్ పాల్గొన్నారు.

## ఆకట్టుకున్న చిన్నారుల నృత్య ప్రదర్శన



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులు

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాల్లో పాతబస్తీకి చెందిన మంజుల డాన్స్ అకాడమీ విద్యార్థులు తమ నృత్య ప్రదర్శనతో ఆకట్టుకున్నారు. పలు ఆధ్యాత్మిక పాటలపై హావభావాలను ఒలికిస్తూ తమ ఆహూతులను మంత్ర ముగ్ధులను చేశారు.నిర్వాహకులు కళాకారుల బృందాన్ని ఘనంగా స న్మానించి ప్రశంస పత్రాలను అందజేశారు.స్వామి వారి సన్నిధిలో తమ నృత్యప్రదర్శనకు అనుమతించిన ఈవో,అధికారులకు డాన్స్ అకాడమి నిర్వాహకురాలు మంజుల రాణి,విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

## డెస్క్ జర్నలిస్టులందరికి అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలి



గన్‌పార్కు ఎదుట ర్యాలీని ప్రారంభించిన డెస్క్ జర్నలిస్టులు. చిత్రంలో మామిడి సోమయ్య తదితరులు

**సైఫాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** డెస్క్ జర్నలిస్టులకు అక్రెడిటేషన్లు పెంచాలని డిమాండ్ చేస్తూ అనేక మంది జర్నలిస్టులు బుధవారం నగరంలో ప్రదర్శన నిర్వహించారు. డెస్క్ జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో ఈ ప్రదర్శన అసెంబ్లీ ఎదురుగా ఉన్న గన్‌పార్కు నుంచి ప్రారంభమై తెలంగాణ మీడియా అకాడమీ వరకు కొనసాగింది. ప్రదర్శనలో పాల్గొన్న జర్నలిస్టులు అందరికి అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వాలని డిమాండ్ చేస్తూ పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మీడియా అకాడమీ కార్యాలయం ఎదుట బైఠాయించారు. ఈ ప్రదర్శనలో తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టిడబ్ల్యూజేఎఫ్), టియూడబ్ల్యూజే-143 సంఘాల నాయకులు పాల్గొని సంపూర్ణంగా మద్దతు ప్రకటించారు. ఈ సందర్భంగా ఫెడరేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ గత ప్రభుత్వం 22 వేల అక్రెడిటేషన్ కార్డులు ఇస్తే ఈ ప్రభుత్వం ఒక అడుగు ముందుకేసి 44 వేల కార్డులు ఇస్తామని ప్రకటించి అనేక నిబంధనలు పెట్టి కార్డుల సంఖ్యను భారీగా తగ్గించే ప్రయత్నం చేస్తున్నదని ఆరోపించారు. గతంలో మాదిరిగా జర్నలిస్టులకు అక్రెడిటేషన్ కార్డులు ఇవ్వకపోతే అన్ని జర్నలిస్టు సంఘాలను కలుపుకుని సచివాలయం ముట్టడిస్తామని సోమయ్య హెచ్చరించారు. ఈ ప్రదర్శనలో ఫెడరేషన్ కో-కన్వీనర్ తన్నీరు శ్రీనివాస్, హైదరాబాద్ జిల్లా కన్వీనర్ రవికుమార్, నాయకుడు బ్రహ్మం, డెస్క్ జర్నలిస్టుల సంఘం అధ్యక్షుడు ఉపేందర్, ప్రధాన కార్యదర్శి రాజారాం, నాయకులు వెంకటరమణ, వెంకటేష్, మహిళా జర్నలిస్టు పి.పద్మ తదితరులు పాల్గొన్నారు.

## కుత్బుల్లాపూర్‌లో గెలిచేది గ్రేటర్‌లో నిలిచేది కాంగ్రెసే : కె.ఎం.గౌరీష్



కుత్బుల్లాపూర్ కార్పొరేటర్ కూన పారిజాత గౌరీష్‌కు మద్దతుగా డివిజన్‌నుండి తరలివచ్చిన కాంగ్రెస్ అభిమానులు

**కుత్బుల్లాపూర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త**

కాంగ్రెస్ ప్రభుత్వ రెండేళ్లపాలనపై ప్రజలకు పూర్తివిశ్వాసం వుందని రానున్న గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ మేయర్‌పీఠం కైవసం చేసుకోవడం ఖాయమని కుత్బుల్లాపూర్ కార్పొరేటర్ కూన పారిజాత గౌరీష్ అన్నారు. చింతల్ మాణిక్యనగర్‌లో కాంగ్రెస్‌పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చి కె.ఎం.గౌరీష్‌కు పూర్తిమద్దతు తెలిపారు. ఈసందర్భంగా అభిమానులు,కాంగ్రెస్ నాయకులను ఉద్దేశించి గౌరీష్ మాట్లాడుతూ గ్రేటర్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి మేయర్‌పీఠం కైవసంచేసుకవడం ఖాయమన్నారు. కాంగ్రెస్‌కు కుత్బుల్లాపూర్ మొదటినుండి కంచుకోటగా నిలిచిందని తెలంగాణ సాధించేదిశలో ప్రజలు పార్టీలకు అతీతంగా కెసిఆర్‌కు మద్దతు తెలిపారని గుర్తుచేశారు. గ్రేటర్ ఎన్నికలు పూర్తయ్యేవరకు కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ కంచుకోటగా మారడం ఖాయమన్నారు. ఈసందర్భంగా తనకు మద్దతుగా వచ్చిన డివిజన్ పరిధితోపాటు వివిధ ప్రాంతాలనుండివచ్చిన కాంగ్రెస్ అభిమానులు, నాయకులకు, మహిళలకు అయన ప్రత్యేక కృతజ్ఞతలుతెలిపారు. ఈసందర్భంగా నాయకులు నార్లకంటి రమేశ్ యాదవ్, ,సురేందర్‌రెడ్డి, మధుకర్, ఆరుణ, ఉమాదేవి, బాస్కర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మీదేవమ్మ పార్థీవదేహానికి నివాళులర్పించిన రాజేశ్వరరావు



**కెపిహెచ్‌బి కాలనీ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త**

రాష్ట్ర సగర సంగం గౌరవ సలహాదారులు, స్టీరింగ్ కమిటీ చైర్మన్ కె.పీ రాంసాగర్ సతీమణి జగద్గిరిగుట్ట సగర సంగం గౌరవ సలహాదారు లు కెపి లక్ష్మీ దేవమ్మ మంగళవారం అకాల మరణం చెందారు. విషయాన్ని తెలుసుకున్న బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వడ్డేపల్లి రాజేశ్వరరావు బుధవారం ఉదయం లక్ష్మీదేవమ్మ పార్థివ దేహాన్ని సందర్శించి ఘనంగా నివాళులు అర్పించారు. ఆమె కుటుంబ సభ్యులను పరామర్శించారు. భగవంతుడు కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని రాజేశ్వరరావు ఆకాంక్షి ంచారు.

# 27న హలో బిసి...చలో ఇందిరా పార్క్

**హైదరాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:**

బడ్జెట్‌లో బీసీలకు జరుగుతున్న అన్యాయానికి నిరసనగా ఈనెల 27న బీసీ ఇంటలెక్చువల్ ఫోరం, బిసి పొలిటికల్ ఫ్రంట్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించే దీక్ష కార్యక్రమానికి బీసీ విద్యార్థులు, యువకులు ,మేధావులు ,బీసీ సంఘాల నేతలు, కుల సంఘాల పెద్దలు, బీసీ ప్రజాప్రతినిధులు ,పెద్ద ఎత్తున తరలివచ్చి దీక్షను విజయవంతం చేయాలని బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్ పిలుపునిచ్చారు. బుధవారం చిక్కడపల్లి బీసీ పొలిటికల్ ఫ్రంట్ రాష్ట్ర కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్ మాట్లాడుతూ.. కామారెడ్డి బీసీ డిక్లరేషన్ వెంటనే అమలు చేయాలని, ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ బీసీలకు ఇచ్చిన వాగ్దానాలను ఇప్పటివరకు ఏ ఒక్కటి నెరవేర్చకపోవడానికి రాష్ట్ర ప్రభుత్వంపై నిరసనగా ఈనెల 27 శుక్రవారం రోజున ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు కొనసాగే బీసీల దీక్ష కార్యక్రమానికి పెద్ద ఎత్తున తరలిరావాలని బిసిలకు పిలుపునిచ్చారు. ఈ దీక్ష కార్యక్రమానికి వివిధ రాజకీయ పార్టీలకు చెందిన బీసీ ప్రజాప్రతినిధులు, బిఆర్ఎస్ పార్టీ నుంచి మాజీ మంత్రి వి. శ్రీనివాస్ గౌడ్,



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీసీ పొలిటికల్ ఫ్రంట్ చైర్మన్ బాలగోని బాలరాజ్ గౌడ్

తలసాని శ్రీనివాస యాదవ్, మాజీ స్పీకర్ మధుసూదనా చారి, బిజెపి పార్టీ నుండి పార్లమెంట్ సభ్యుడు ఈటెల రాజేందర్, శాసనసభ్యులు పాయల్ శంకర్, కాంగ్రెస్ పార్టీ నుండి సీనియర్ నాయకులు మాజీ రాజ్యసభ సభ్యుడు వి. హనుమంతరావు, ప్రచార కమిటీ చైర్మన్ మధుయాష్కి గౌడ్, సిపిఐ సిపిఎం నుంచి ప్రముఖ బీసీ నాయకులు పాల్గొంటారని తెలిపారు. ఈ కార్యక్రమానికి బీసీ పొలిటికల్ ఫ్రంట్ వైస్ చైర్మన్ ఎస్. దుర్గయ్య గౌడ్, బీసీ పొలిటికల్ ఫ్రంట్ కన్వీనర్‌లు బైరు శేఖర్, ఐలి వెంకన్న గౌడ్, ఎల్లికట్టే విజయ్ కుమార్ గౌడ్, అంబాల నారాయణ గౌడ్, బీసీ జన సైన్యం రాష్ట్ర అధ్యక్షులు సింగం నగేష్ గౌడ్, నాగభూషణం తదితరులు పాల్గొన్నారు.

# పాల ఉత్పత్తుల తయారీపై అవగాహన సదస్సు

**అత్తాపూర్ ఫిబ్రవరి25ప్రభాతవార్త :**

గేదెలు,ఆవుల నుండి పాల ఉత్పత్తిని పెంచుకునేందుకు పచ్చి గడ్డి లేదా ఎండు గడ్డిలో కొన్ని చిట్కాలు పాటిస్తే పాల ఉత్పత్తులు పెంచుకోవచ్చని పలువురు శాస్త్రవేత్తలు సూచించారు.బుధవారం రాజేంద్రనగర్‌లో డిపార్ట్‌మెంట్ ఆఫ్ లైవ్‌కో ప్రొడక్ట్స్ టెక్నాలజీ విభాగంలో పివి నర్సింహారావు తెలంగాణ వెటర్నరీ విశ్వవిద్యాలయం, కాలేజ్ ఆఫ్ వెటర్నరీ సైన్స్, నేషనల్ మీట్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్ హైదరాబాద్ ఆధ్వర్యంలో ప్రత్యేక్ష ఎస్సీ, ఎస్పీ కార్యక్రమంలో భాగంగా రైతులకు పాల ఉత్పత్తులపై అవగాహన కల్పించే ఒక రోజు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా అధిక పాల ఉత్పత్తులతో పెంపకందారులు అధిక లాభాలు పొందేలా అవగాహన కల్పించారు. ఈ శిక్షణ కార్యక్రమం ముఖ్యంగా గ్రామీణ మహిళలు, యువత పాల ఉత్పత్తుల విలువ జోడింపు ద్వారా ఆధాయ మార్గాలు అనే అంశంపై కార్యక్రమం నిర్వహించగా అసోసియేట్ డీన్ డా. మాధురి, ఎన్.ఎం.ఆర్.ఐ డైరెక్టర్



డా బర్బుద్దే ,ముఖ్య అతిథిగా హాజరై రైతులకు పలు సూచనలు చేశారు. అసోసియేట్ ప్రొఫెసర్ అండ్ హెడ్ విభాగాధిపతి డా. స్వామి జగదీష్ , అసోసియేట్ ప్రొఫెసర్, లైవ్ స్టాక్ ప్రొడక్ట్స్ టెక్రాలజీ డా. సాహిత్యరాణి, అసిస్టెంట్ ప్రొఫెసర్ స్నేహప్రియులు వారు ఖోవా, కలాకండ్, పనీర్, చన్నా, రసగుల్లా, రసమలే, బాసందీ, మజ్జిగ లస్సీ, ఫ్లేవర్డ్ మిల్క్, వే డ్రింక్, వంటి విలువ ఆధారిత పాల ఉత్పత్తుల తయారీపై శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ప్రొఫెసర్ వెటర్నరీ ఎక్స్టెన్షన్ డిపార్టమెంట్ డా.సత్యనారాయణ, జీహెచ్ఎంసీ హైదర్గూడ డిపివో విభాగం కరుణాకర్‌లు ప్రత్యేక సహకారాలు అందించారు.

# పురస్కారాలతో రచయితలకు పేరు ప్రోత్సాహం

**-తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి చైర్మన్ నందిని సిధారెడ్డి**

**రవీంద్రభారతి, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** కవులు, రచయితలు ప్రతీఒక్కరూ పురస్కారాలు పొందాలని ఆశిస్తూ ఉండడంలో తప్పులేదని, పురస్కారం వల్ల రచనకు, రచయితకు సమాజంలో మంచి పేరుతోపాటు ప్రోత్సాహం లభిస్తుందని తెలంగాణ సాహిత్య అకాడమీ తొలి ఛైర్మన్ డా. నందిని సిధారెడ్డి అన్నారు. ఈ సందర్భంగా డా. మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారాల స్వీకర్తలను ఆయన అభినందించారు. తెలంగాణ ప్రభుత్వ భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో డా. మాడభూషి రంగాచార్య స్మారక సంఘం ఆధ్వర్యంలో రవీంద్రభారతిలోని సమావేశ మందిరంలో ప్రముఖ సాహితీవేత్త డా. నాళేశ్వరం శంకరం సభాధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన తెలంగాణప రాష్ట్ర సాహిత్య అకాడమీ తొలి అధ్యక్షుడు, ప్రముఖ కవి డా. నందిని సిధారెడ్డి విశిష్ట అతిథి రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు డా. ఏనుగు నరసింహారెడ్డి, రచయిత్రులు



ఆనందాచారి, జ్యోతిలను స్మారక కథా పురస్కారాలతో సత్కరిస్తున్న నందిని సిధారెడ్డి, నాళేశ్వరం శంకరం, ఏనుగు నరసింహారెడ్డి, సుభద్రాదేవి, లలిత తదితర అతిథులు

సమ్మెట ఉమాదేవి, రూప రుక్మిణి, సంఘ అధ్యక్షురాలు శీలా సుభద్రాదేవి, కన్వీనర్ మాడభూషి లలిత తదితరులతో కలిసి గస్సాల్ కథాసంపుటి రచయిత కటుకోజ్వల ఆనందాచారిని ఘనంగా సత్కరించి 2025 సంవత్సరానికిగాను; ఉలిపికట్టెలు కథాసంపుటి రచయిత పి.జ్యోతిని ఘనంగా సత్కరించి 2026 సంవత్సరానికిగాను డా. మాడభూషి రంగాచార్య స్మారక కథా పురస్కారాలను ప్రదానం చేసి ఎంతగానో అభినందించారు. చివరిగా ఉమాదేవి గస్సాల్ కథల సంపుటి, రుక్మిణి ఉలిపికట్టెలు కథల సంపుటిల పరిచయం కావించారు.

# ప్రభుత్వ ఉద్యోగులకు 'నగదు రహిత చికిత్స' హర్షణీయం

**-టిజివో జిల్లా అధ్యక్షులు ఎంబి.కృష్ణయాదవ్, కార్యదర్శి ఖాదర్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:**

తెలంగాణ రాష్ట్ర ఉద్యోగులు, పెన్షనర్లకు ఈ.హెచ్.ఎస్ నగదు రహిత చికిత్స పథకం, రూ.1.20 కోట్ల ప్రమాద కోట్ల మూలనిధితో పథకాన్ని పెట్టడం హర్షణీయమని అన్ని ఉద్యోగ వర్గాల చిరకాల వాంఛను నెరవేర్చారంటూ తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ హైదరాబాద్ జిల్లా బ్రాంచ్ అధ్యక్షుడు ఎం బి కృష్ణ యాదవ్, కార్యదర్శి ఎం.ఎ. ఖాదర్‌లు సిఎం రేవంత్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు.ఉ ద్యోగులు, పెన్షనర్లకు ప్రభుత్వం ప్రకటించిన ఆరోగ్య, బీమా పథకాలు చరిత్రలో నిలిచిపోతాయని వారు కొనియాడారు. ఈమేరకు బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ 1,998 వ్యాధులకు నగదు రహిత చికిత్స లను పొందే విధంగా ఉద్యోగులు, పెన్షనర్లకు అవకాశం లభించడం ఎంతో



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణయాదవ్, ఖాదర్ తదితరులు

ఆనందదాయకం అని తెలిపారు. ఈ సందర్భంగా కేబినెట్ మంత్రులకు, హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్, టి జి వో రాష్ట్ర అధ్యక్షుడు ఏలూరి శ్రీనివాస్, రాష్ట్ర జనరల్ సెక్రెటరీ బి.శ్యామ్‌లకు ధన్యవాదాలు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా అసోసియేట్ ప్రెసిడెంట్ ఆశన్న, ట్రెజరర్ వెంకటరమణ, వైస్ ప్రెసిడెంట్ సంయుక్త కార్యదర్శులు డాక్టర్. క్రొత్త విద్యా సాగర్, శ్రీరామ్, సరస్వతి పాల్గొన్నారు.

## పగటి పూటనే పట్టుబడ్డారు

**- జూబ్లీహిల్స్ జోన్‌లో నాలుగు కేసులు నమోదు**





బంజారాహిల్స్‌లో ఇన్స్పెక్టర్ సునీల్ ఆధ్వర్యంలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు.

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్తః**

పగటి పూట మద్యం సేవించి కొందరు ప్రబుద్ధులు ట్రాఫిక్ పోలీసులకు చిక్కారు. జూబ్లీహిల్స్ జోన్ ట్రాఫిక్ ఎసిపి కట్టా హరిప్రసాద్ కథనం ప్రకారం.. ప్రమాదాలను నివారించేందుకు ఉన్నతాధికారుల సూచనల మేరకు ఉదయం వేళలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు నిర్వహిస్తున్నామన్నారు. ఇందులో భాగంగా బుధవారం బంజారాహిల్స్, ఎస్సార్‌నగర్ ఠాణాల పరిధిలోని ఎన్టీఆర్ భవన్, తాజ్‌కృష్ణ, విరించి ఆసుపత్రి, మైత్రివనం కూడళ్లలో తనిఖీలు చేపట్టారు. ఇందులో భాగంగా మద్యం సేవించి వాహనాలు నడుపుతూ బంజారాహిల్స్ ఠాణా పరిధిలో ఇద్దరు, ఎస్సార్‌నగర్ ఠాణా పరిధిలో మరో ఇద్దరు వాహనదారులు పట్టుబడ్డారు.వారికి శ్వాస విశ్లేషణ పరీక్షలు నిర్వహించగా రక్తంలో మద్యం మోతాదు శాతం ఉన్నట్లు గుర్తించారు.దీంతో వారిపై కేసులు నమోదు చేసి వాహనాలను స్వాధీనం చేసుకున్నారు.పగటి పూట తనిఖీలు ప్రతి రోజు కొనసాగుతాయని మద్యం సేవించి వాహనాలు నడిపి ప్రమాదానికి కారకులు కావొద్దని ఎసిపి సూచించారు.

## కుమ్మెర ఘటనపై సిపిఎం ఆందోళన



ఫలక్‌నుమా వద్ద నిరసన తెలుపుతున్న సీపీఎం నేతలు

**చాంద్రాయణగుట్ట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త :** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెర జాతరలో దళితులపై జరిగిన దాడిని నిరసిస్తూ సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.విఠల్ ఆధ్వర్యంలో ఫలకనుమా వద్ద బుధవారం నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఎండి అబ్బాస్ మాట్లాడుతూ కుమ్మెరలో జరిగిన ఘటన అత్యంత శోచనీయమన్నారు. రెండు నెలల పసికందును హత్య చేసిన రెడ్డి కులస్థులపై వెంటనే కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా పోలీస్ అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. చనిపోయిన పసిపాప కుటుంబానికి ప్రభుత్వం తగిన నష్టపరిహారం చెల్లించి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కమిటీ సభ్యులు ఎల్.కోటయ్య, శశికళ, కృష్ణ నాయక్, జోన్ కార్యదర్శి ఎస్.కిషన్, సభ్యులు రాంకుమార్, శ్రీను, జ్యోతి, రంగస్వామి, గౌస్, హమీద్, మురారి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

## ఎంఐఎంతో బిజెపి చీకటి ఒప్పందం : బోయ నగేష్

**హైదరాబాద్,ఫిబ్రవరి 25,ప్రభాతవార్త:** ఎంఐఎంతో బిజెపికి ఉన్న చీకటి ఒప్పొందం బయటపెడుతామని ,కరీంనగర్ కార్పొరేషన్ ఎంఐఎం సపోర్ట్ తోనే బిజెపి కైవసం చేసుకుందనీ చాంద్రాయణగుట్ట కాంటెస్టెడ్ ఎమ్మెల్యే బోయ నగేష్ ఆరోపించారు. బుధవారం గాంధీభవన్‌లో మాట్లాడుతూ...కేంద్ర మంత్రి బండి సంజయ్ హిందువులను రెచ్చగొట్టి రాజకీయంగా పబ్బం గడుపుకొంటున్నారనీ విమర్శించారు..కేంద్ర మంత్రి గా ఉంది హైదరాబాద్‌కు ఏం చేశావనీ ప్రశ్నించారు.పాత బస్తీ నీ ఎక్కడ అభివృద్ధి చేశావనీ నిలదీశారు. ఖబర్దార్ బండి సంజయ్ హిందువులను రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేస్తే తగిన బుద్ధి చెప్తాం అనీ హెచ్చరించారు. భాగ్యలక్ష్మీ అమ్మవారి మీద ప్రమాణం చేసి ఎంఐఎం తో పొత్తు లేదని నువ్వు చెప్ప గల వా?మీ చీకటి ఒప్పందం బయట పెడతాం, అంతేకాదు జిహెచ్ఎంసి ఎన్నికల్లో బిజెపిని చిత్తుగా ఓడిస్తాము అని హెచ్చరించారు. కెటిఆర్ మీరు ఇంకా అధికారం లో ఉన్న ట్లు భ్రమలో ఉన్నారని ఎద్దేవా చేశారు. కెటిఆర్ భ్రమల లోంచి బటయకు రావాలని,మంత్రి వెహికిల్ పై దాడి చేస్తే అరెస్ట్ చేయకుండా దండ వేస్తారా అని ప్రశ్నించారు. పోలీసులు వాళ్ల పని వాళ్ళు చేస్తున్నారనీ,రెడ్ బుక్ పేరుతో వాళ్లను మీరు బెదిరించడం తగదని హితవు చెప్పారు. తెలంగాణలో మీ పప్పులు ఉడకవు, కేటీఆర్ జైలుకు వెళ్ళే రోజులు దగ్గర పడ్డాయనీ అధికారంలోకి రావడం కల్ల అనిఅన్నారు.

# ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లో అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం

**చిక్కడపల్లి ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :**

నగర ట్రాఫిక్ జాయింట్ కమిషనర్ ఆఫ్ పోలీస్ ఆదేశాల బుధవారం ఆర్టీసీ క్రాస్ రోడ్స్ వద్ద ఖిఅరైవ్ అలైవ్ఖి రోడ్ సేఫ్టీ ఫేజ్2 కార్యక్రమాన్ని చిక్కడపల్లి ట్రాఫిక్ పోలీసులు ఘనంగా నిర్వహించారు. ఇన్స్పెక్టర్ కె.ఏడుకొండలు నేతృత్వంలో జరిగిన ఈ కార్యక్రమంలో వాహనదారులకు రోడ్డు భద్రతపై కీలక సూచనలు చేస్తూ అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రధానంగా ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా నాణ్యమైన హెల్మెట్ ధరించాలని, ఇది ప్రాణాపాయం నుండి రక్షిస్తుందని వివరించారు. కార్లలో ప్రయాణించే వారు సీటు బెల్టు ధరించడం వల్ల ప్రమాదాల తీవ్రత తగ్గుతుందని, వాహనాలను ఎడమ వైపు నుండి ఓవర్‌టేక్ చేయడం ప్రమాదకరమని, ఎల్లప్పుడూ సరైన పద్ధతిలోనే ఓవర్‌టేక్ చేయాలని సూచించారు. దీంతో పాటు రోడ్డుపై డ్రైవింగ్ చేసేటప్పుడు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను తూచా తప్పకుండా పాటించాలని, తోటి ప్రయాణికుల భద్రతను కూడా దృష్టిలో



చిక్కడపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ కె. ఏడుకొండలు ఆధ్వర్యంలో ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో అరైవ్ అలైవ్ రోడ్ సేఫ్టీ అవగాహన కార్యక్రమం నిర్వహించిన దృశ్యం

ఉంచుకోవాలని కోరారు. ఏడుకొండలు మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజల భాగస్వామ్యం ఎంతో అవసరం. కేవలం జరిమానాల భయంతో కాకుండా, తమ ప్రాణాల రక్షణ కోసం ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలను ఒక బాధ్యతగా పాటించాలి. ఖిఅరైవ్ అలైవ్ఖి కార్యక్రమంలో భాగంగా నగరంలోని అన్ని ప్రధాన కూడళ్లలో ఇటువంటి అవగాహన కార్యక్రమాలను మరిన్ని నిర్వహిస్తామన్నారు.

# వృత్తిదారుల సంక్షేమానికి రాష్ట్ర బడ్జెట్‌లో రూ.25 వేల కోట్లు కేటాయించాలి

**చిక్కడపల్లి ఫిబ్రవరి 25 (ప్రభాతవార్త) :** రాష్ట్ర ప్రభుత్వం మార్చిలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో చేతివృత్తిదారుల సంక్షేమానికి 25000 కోట్లు కేటాయించాలని చేతి వృత్తి దారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ యం.వి.రమణ డిమాండ్ చేశారు. బుధవారం వృత్తిదారుల భవనంలో మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి లెల్లెల బాలకృష్ణ అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వృత్తిదారుల సంక్షేమానికి కార్పొరేషన్లు, ఫెడరేషన్లు ఉన్నప్పటికీ ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోవడంతో ఎలాంటి సంక్షేమ పథకాలు చేపట్టలేదని అన్నారు. ఈ ఫెడరేషన్ లు ఉత్సవ విగ్రహాలుగా మారాయి. రోజువారిగా వృత్తులు చేస్తూ జీవిస్తున్న వీరికి ప్రోత్సాహమే లేదు. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ప్రణాళికలో ఇచ్చిన హామీలు అమలు చేయలేదని దుయ్యబట్టారు.50 సంవత్సరాల పైబడిన వృత్తిదారులందరికీ 4 వేల పెన్షన్ అమలు చేయాలని, పెండింగ్ ఎక్స్‌గ్రేషియా డబ్బులు వెంటనే విడుదల చేయాలని, అన్ని రకాల వృత్తిదారులందరికీ బీమా సౌకర్యం కల్పించాలని అన్నారు.నాగర్ కర్నూల్ జిల్లా కొమ్మెర గ్రామంలో గుడిలోకి వచ్చిన రజక మహిళ, దళితులపై గ్రామ పెత్తందారులు దాడి చేసి పసిపాపను చంపిన ఘటనను సమావేశం తీవ్రంగా ఖండించింది. దోషులను వెంటనే శిక్షించాలని డిమాండ్ చేసింది. మార్చిలో ప్రవేశపెట్టబోయే బడ్జెట్ లో 25 వేల కోట్లు నిధులు కేటాయించాలని,



ప్రసంగిస్తున్న చేతి వృత్తి దారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ యం.వి.రమణ

బీసీ సబ్ ప్లాన్ చట్టం చేయాలని, బీసీలకు విద్యా, ఉద్యోగం, స్థానిక సంస్థల ఎన్నికలలో 42 శాతం రిజర్వేషన్స్ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మార్చి 17వ తేదీన ఇందిరా పార్క్ వద్ద మహా ధర్నా నిర్వహిస్తున్నామని దీనికి వృత్తిదారులందరూ వేలాదిగా తరలి రావాలని వృత్తి సంఘాల నేతలు పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో గొర్రెలు మేకల పెంపకందార్ల సంఘం రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు కిల్లె గోపాల్, ఉడుత రవీందర్, మత్స్య కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షులు గోరెంకల నర్సింహ, కల్లుగీత కార్మిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వి. వెంకట నరసయ్య, బ్యాండ్ వాయిద్య కళాకారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి జి. నాగరాజు, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు ఎదునూరి మదార్ ,చేనేత కార్మిక సంఘం రాష్ట్ర కార్యదర్శి గంజి మురళి, విశ్వకర్మ వృత్తిదారుల సంఘం రాష్ట్ర కార్యదర్శి రాళ్ల బండి కుమారస్వామి, యాదగిరి చారి తదితరులు పాల్గొన్నారు.

## కన్నులపండువగా విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలు



ఆర్టీసీ క్రాస్ రోడ్స్ పంచముఖ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానం కుంభాభిషేక మహోత్సవాలలో భాగంగా హోమాది కార్యక్రమంలో ఆలయం ధర్మాధికారి కళా వి.ఎస్. జనార్థన మూర్తి

**చిక్కడపల్లి ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :**

ఆర్టీసీ క్రాస్ రోడ్స్‌లోని శృంగేరి జగద్గురు మహాసంస్థానము, శ్రీ పంచముఖ ఆంజనేయ లక్ష్మీవేంకటేశ్వర స్వామి దేవస్థానంలో శివాలయ నవగ్రహ పునఃప్రతిష్ఠా కుంభాభిషేక మహోత్సవాల భాగంగా బుధవారం కన్నులపండువగా వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు.ఆలయ ధర్మాధికారి కళా వి.ఎస్. జనార్ధన మూర్తి పర్యవేక్షణలో వైభవంగా ఆధ్యాత్మిక క్రతువులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు జరిగాయి. విశేష హోమములు, కలశ ప్రతిష్ఠలు,యంత్ర స్థాపన, విగ్రహ ప్రతిష్ఠా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా జరిపించారు. 26న ఉదయం ప్రాణ ప్రతిష్ఠ, మహాపూర్ణాహుతి కార్యక్రమాలు ఉంటాయి. అనంతరం నిర్ణయించిన సుముహూర్తంలో ప్రధాన ఘట్టమైన కుంభాభిషేకము, కలశాభిషేకము నిర్వహించనున్నారు.ఈ మహోత్సవానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చి స్వామివార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

## జూపార్కులో ముందు జాగ్రత్తలు



జూపార్కులోని ఎన్‌క్లోజర్ వద్ద క్రిమి సంహారక మందును పిసికారి చేస్తున్న సిబ్బంది

**చార్మినార్,ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** థాయ్‌లాండ్‌లోని ప్రైవేట్ జూపార్కులో అంతు చిక్కని వైరస్ సోకి పులులు చనిపోవటంతో ముందు జాగ్రత్తగా హైదరాబాద్ పాతబస్తీ బహదూర్‌పుర శివారులో ఉన్న నెహ్రూ జూలాజికల్ పార్కు అధికారులు అప్రమత్తమయ్యారు.జూపార్కు క్యూరేటర్ జె.వసంత ఆదేశాలు మేరకు జూపార్కులో ఉన్న జంతువులు,పక్షుల ఎన్‌క్లోజర్లు వద్ద క్రిమి సంహారక మందును చల్లి పిసికారి చేశారు.ముందుస్తు జాగ్రత్తగా అన్ని చర్యలు తీసుకున్నారు. జూపార్కులోని ఉన్న పక్షులకు రోగ నిరోధక శక్తిని పెంచే మందులు అందజేస్తున్నారు.జూపార్కు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచారు.

## శ్రీలంకలో విశ్వజన కళా మండలి స్వర్ణోత్సవ వేడుకలు



సమావేశంలో మాట్లాడుతున్న డా.జి.మాస్టార్జీ

**సైఫాబాద్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** విశ్వజన కళా మండలి స్వర్ణోత్సవ వేడుకలు శ్రీలంక దేశంలోని కొలంబో రాజధాని నగరంలో నిర్వహిస్తున్నామని మండలి జాతీయ అధ్యక్షుడు డా.జి. మాస్టార్జీ తెలిపారు. సెప్టెంబరు 7వ తేదీనాటికి కళా మండలికి 49 ఏళ్ళు నిండి 50 వసంతంలోకి అడుగిడుతున్న తరుణంలో ఈ స్వర్ణోత్సవాలను ఒక ఏడాది పాటు తెలుగు రాష్ట్రాలతోపాటు పలు ఇతర రాష్ట్రాలలో నిర్వహిస్తామని, ముగింపు వచ్చే ఏడాది సెప్టెబరు 6వ తేదీన బిహార్ రాష్ట్రంలో చేస్తామన్నారు. బుధవారం బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమాలను ఘనంగా నిర్వహించడానికి గ్లోబల్ ఈవెంట్స్ సంస్థ ముందుకు వచ్చిందని, శ్రీలంక దేశంలో 4 రాత్రులు, 6 పగళ్ళు ఉండి విశ్వకళా మండలి నిర్వహించే సంగీత, సాహిత్య, నృత్య, నాటక, ఇతర సదస్సుల్లో పాల్గొనవలసి ఉంటుందన్నారు. చివరి రోజున కార్యక్రమానికి విచ్చేసిన వారికి సర్టిఫికేట్లు, వివిధ రంగాలలో విశేషమైన సేవలు అందించిన వారికి పురస్కారాలను ప్రదానం చేయడం జరుగుతుందని, 50 సంవత్సరాల లోపు వారు మాత్రమే పాల్గొనాలని మాస్టార్జీ కోరారు. పాల్గొన దలిచిన వారు ఇతర వివరాలకు 8500005757 ఫోన్ నెంబరులో సంప్రదించాలని ఆయన కోరారు. ఈ సమావేశంలో ఈవెంట్ డైరెక్టర్ డా.తంగిశెట్టి సత్యనారాయణ, మండలి ప్రతినిధులు నాగేశ్వర్‌రావు, సుదర్శన్, యాదగిరి, రాణి తదితరులు పాల్గొన్నారు.

## గగన్‌పహాడ్‌లో అధ్వానంగా ప్రధాన రహదారి

**-పట్టించుకోని ప్రజాప్రతినిధులు,అధికారులు**



**అత్తాపూర్ ఫిబ్రవరి25ప్రభాతవార్త :**

రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని గగన్‌పహాడ్‌లో రోడ్లు అధ్వానంగా మారాయి.పట్టించుకోవాల్సిన అధికారులు, ప్రజాప్రతినిధులు కన్నెత్తి చూడడం లేదని స్థానికుల నుండి ఆరోపణలు వినిపిస్తున్నాయి.నిత్యం వేలాది వాహనాలు ప్రయాణలు సాగిస్తుంటారని రోడ్ల బాలేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని వాపోతున్నారు.ఈ సందర్భంగా మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ బిజెపి అధ్యక్షుడు సురెడ్డి వినయ్ రెడ్డి మాట్లాడుతూ... రాజేంద్రనగర్ నియోజకవర్గ ఎమ్మెల్యేగా ప్రకాష్ గౌడ్ నాలుగు సార్లు ఎన్నికైనప్పటికి ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పించడంలో పూర్తి విఫలమైయ్యారని ఆరోపించారు.ఎమ్మెల్యే సోదరుడి ప్రాంతాల్లో మూడు లేయర్ల రోడ్డు వేస్తున్నారని కాని గగన్‌పహాడ్ ప్రధాన రహదారి అధ్వానంగా మారిన ఎమ్మెల్యే పట్టించుకోవడం లేదన్నారు.దెబ్బతిన్న గుంతల రోడ్లతో వాహనదారులు,పాదచారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు.అభివృద్ధి పనులు వ్యక్తిగత ప్రాంతాలకు మాత్రమే కాకుండా నియోజకవర్గానికి సమానంగా చేయాలని డిమాండ్ చేశారు

## రోడ్డుపై దొరికిన డబ్బు పోలీసులకు అప్పగింత



సతీష్‌ను సత్కరిస్తున్న మధురానగర్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్తః**

తనకు దొరికిన డబ్బును పోలీసులకు అప్పగించిన ఒకరిని మధురానగర్ పోలీసులు సత్కరించారు. వివరాల్లోకి వెళితే.. కృష్ణానగర్‌కు చెందిన వ్యాపారవేత్త ఎల్.వి. సతీష్(50)కు రోడ్డుపై రూ. 50వేల నగదు లభించింది. దీంతో ఆయన వెంటనే 100కు సమాచారం అందించి, మధురానగర్ పోలీసులకు ఆయా డబ్బును అప్పగించారు. దర్యాప్తు చేపట్టిన మధురానగర్ పోలీసులు విచారణ అనంతరం అసలు యజమానిని గుర్తించి ఆయనకు సురక్షితంగా ఆయా నగదు మొత్తం అప్పగించారు. నిజాయితీగా డబ్బులు అప్పగించిన సతీష్ సామాజిక బాధ్యతను ప్రశంసిస్తూ మధురానగర్ ఇన్స్పెక్టర్ ప్రభాకర్ ఆయనను అభినందించి సత్కరించారు. సతీష్ చేసిన ఈ మంచి పని సమాజానికి ప్రేరణగా నిలుస్తుందన్నారు. ఆయనలాంటి బాధ్యతాయుత పౌరులు ఉండటం సమాజానికి గర్వకారణమన్నారు.

## మహిళలను వేధిస్తున్న పోకిరికి నాలుగు రోజుల జైలు

**జూబ్లీహిల్స్, ఫిబ్రవరి 25, ప్రభాతవార్తః**



జైలు శిక్ష పడిన నిందితుడు నాగరాజు.

గోడలపై, పబ్లిక్ టాయిలెట్లు, రైలులో మహిళల ఫోన్ నంబర్లు రాసి వేధిస్తున్న ఒక పోకిరికి కోర్టు జైలుశిక్ష విధించింది. మధురానగర్ పోలీసుల కథనం ప్రకారం.. ఎల్లారెడ్డిగూడలోని అమరం అపార్ట్‌మెంట్‌లో నివసించే పద్మత నాగరాజు(42) కొందరు మహిళలకు సంబంధించిన ఫోన్ నంబర్లను గోడలపై, పబ్లిక్ టాయిలెట్ ప్రదేశాలలో, రైళ్లల్లో తప్పుడుగా రాసేవాడు. దీంతో మహిళలకు గుర్తుతెలియని వ్యక్తుల నుంచి అభ్యంతరకర ఫోన్లు వచ్చేవి. ఈ క్రమంలోనే మహిళలు మధురానగర్ పోలీసులకు ఫిర్యాదు చేయగా పోలీసులు నాగరాజును అరెస్ట్ చేసి అతనిపై 70బి, 70సి సిపి చట్టం కింద కేసు నమోదు చేశారు. బుధవారం నిందితుడిని నాంపల్లిలోని పదో ప్రత్యేక మెజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా న్యాయమూర్తి మంద మురళి నిందితుడికి నాలుగు రోజుల జైలుశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. దీంతో నిందితుడు మధురానగర్ పోలీసులు జైలుకు తరలించారు. గతంలోనూ నిందితుడు ఇలానే ఇరుగుపొరుగు వారితో అసభ్యంగా ప్రవర్తించడం, మహిళలను ఇబ్బంది పెట్టిన సంఘటనలున్నాయి.

## పరీక్షల వేళ విద్యార్థులకు తోడ్పాటు అందించండి : జనార్ధన్



**నేరేడ్‌మెట్ , ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** పరీక్షల సీజన్ నేపథ్యంలో విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని ప్రతి ఒక్కరూ సహకారం అందించాలని 140వ డివిజన్ బిఆర్ఎస్ నాయకుడు తుపాకుల జనార్ధన్ విజ్ఞప్తి చేశారు.పరీక్షా కేంద్రాలకు వెళ్లే మార్గంలో విద్యార్థులు ఎవరైనా లిఫ్ట్ లేదా డ్రాప్ కోరితే స్థానికులు, వాహనదారులు సాధ్యమైనంత వరకు సహాయం చేయాలని ఆయన కోరారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా పరీక్షలకు అనుమతి నిరాకరించే పరిస్థితులు ఉన్నందున సమయపాలన అత్యంత కీలకమని పేర్కొన్నారు.పట్టణ ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్యలు, దూర ప్రాంతాల నుంచి వచ్చే విద్యార్థుల ప్రయాణ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని సామాజిక బాధ్యతతో ముందుకు రావాలని సూచించారు. పరీక్షల సమయంలో విద్యార్థులపై మానసిక ఒత్తిడి ఎక్కువగా ఉంటుందని, వారికి ధైర్యం చెప్పడం, సమయానికి కేంద్రాలకు చేరుకునేలా చేయడం ప్రతి పౌరుడి కర్తవ్యమని అన్నారు."మన చిన్న సహాయం ఒక విద్యార్థి భవిష్యత్తును మార్చగలదు. పరీక్షల కాలంలో సేవాభావంతో ముందుకు వచ్చి విద్యార్థులకు తోడ్పాటు అందిద్దాం" అని తుపాకుల జనార్ధన్ పిలుపునిచ్చారు.మల్కాజిగిరి డివిజన్ ప్రజలు విద్యార్థుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరించి ఆదర్శంగా నిలవాలని కోరారు.

## పక్షవాతం బాధితుడి కుటుంబానికి షైక్ ఫరీద్ అండ



**నేరేడ్ మెట్, ఫిబ్రవరి 25,ప్రభాతవార్త :** ఆపదలో ఉన్న కుటుంబానికి తోడుగా నిలవడం మానవత్వానికి నిదర్శనం. రేణుక నగర్‌లో నివాసముండే సత్యనారాయణ పక్షవాతం, గుండెపోటుతో అనారోగ్యానికి గురై ఉపాధి కోల్పోయాడు. చికిత్స ఖర్చులు, రోజువారీ అవసరాలు కుటుంబాన్ని ఆర్థికంగా కుదేలు చేస్తున్న వేళ, సమాచారం అందుకున్న బిఆర్ఎస్ నాయకులు తక్షణం స్పందించారు.స్థానిక బిఆర్ఎస్ నేతలు షైక్ ఫరీద్, వినీత్ కుమార్ బాధిత కుటుంబాన్ని పరామర్శించి 50 కిలోల బియ్యాన్ని అందజేశారు."ఆపదలో ఉన్న వారిని ఆదుకోవడం సామాజిక బాధ్యత" అని వారు పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు బాలకృష్ణ గుప్త, ఉమేష్ పాల్గొని కుటుంబానికి ధైర్యం చెప్పారు. స్థానికులు ఈ సహాయాన్ని అభినందిస్తూ, ఇలాంటి మానవీయ కార్యక్రమాలు మరింత మందికి ఆదర్శంగా నిలవాలని పేర్కొన్నారు.

## ఇఫ్తార్ విందులు ఐక్యతను పెంపొందిస్తాయి: ఎమ్మెల్యే బలాల



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ఎమ్మెల్యే బలాల, చిత్రంలో మాజీ కార్పొరేటర్ మినాజుద్దీన్, సుగురు రమేష్, ఇఫ్తెకార్, ఒబెయిద్ రెహమాన్ తదితరులు

**మలక్ పేట ,ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** ఇఫ్తార్ విందులు ఐక్యత, స్నేహభావాన్ని పెంపొందిస్తాయని మలక్ పేట్ నియోజకవర్గం ఎమ్మెల్యే అహ్మద్ బలాల పేర్కొన్నారు. మలక్ పేట పల్టాన్ లో సీనియర్ నాయకులు ఓబెయిద్ రెహమాన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందు కార్యక్రమానికి ఎమ్మెల్యే బలాల ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బలాల మాట్లాడుతూ అన్ని వర్గాల ప్రజలు కలిసిమెలిసి ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో ప్రశాంతంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. ఇఫ్తార్ విందులు మతసామరస్యానికి ప్రతీకగా నిలుస్తాయని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ మినాజుద్దీన్, నాయకులు సుగురు రమేష్, ఇఫ్తెకార్ తదితరులు పాల్గొన్నారు.

## బాబా నగర్ డ్రైనేజీ సమస్యపై బిఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు సాయిజెన్ శేఖర్ పర్యటన



సమస్యను తెలుసుకుంటున్న శాంతి సాయిజన్ శేఖర్

**నాచారం, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** నాచారం లోని బాబా నగర్ కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను పరిశీలించేందుకు సాయిజెన్ శేఖర్ బుధవారం పర్యటించారు. నాచారం డివిజన్ పరిధిలోని ఈ ప్రాంతంలో చాలాకాలంగా మురుగునీటి నిల్వలు, కాలువల మురికితో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని స్థానికులు ఆయన దృష్టికి తీసుకువచ్చారు.డ్రైనేజీ సమస్యను పూర్తిగా పరిష్కరించకుండానే కొత్త సిమెంట్ రోడ్లు వేశారని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య ఉన్న అన్ని వీధుల్లో సాయిజెన్ శేఖర్ స్వయంగా తిరిగి పరిశీలించారు. సమస్య పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. మ్యాన్‌హోల్ నుంచి మ్యాన్‌హోల్ వరకు డీప్ క్లీనింగ్ చేపట్టి మురుగు అడ్డంకులను తొలగించాలని, ఎక్కడైనా పైపులైన్లలో ఆటంకాలు ఉన్నట్లయితే వెంటనే మరమ్మతులు చేయించాలని డీజీఎం వేణుగోపాల్‌కు ఫోన్ ద్వారా సూచించారు.అయినా సమస్య పూర్తిగా పరిష్కారం కాకపోతే, అదనంగా ఒక అడుగు డ్రైనేజీ లైన్ ఏర్పాటు చేయడానికి ప్రతిపాదనలు సిద్ధం చేయాలని కోరారు. ప్రజలకు ఇబ్బందులు లేకుండా శాశ్వత పరిష్కారం అందించాలని అధికారులను హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో బాబా నగర్ కాలనీవాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని తమ సమస్యలను వివరించారు.



బడంగ్‌పేట్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బుధవారం శాస్త్రీయ దృక్పథం-పరిశోధనా విధానాలు అనే అంశంపై వర్క్ షాపును నిర్వహించారు. కాలేజీ ప్రిన్సిపాల్ ఆధ్వర్యంలో ఐక్యూఎసి కో-ఆర్డినేటర్, బాటనీ విభాధిపతి డాక్టర్ రామరాజు నిర్వహించిన ఈ వర్క్ షాపులో విద్యార్థులకు పలు విషయాలపై అవగాహన కల్పించి దిశా నిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో పలువురు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

# సురక్షితంగా వాహనాలను నడపాలి : ట్రాఫిక్ ఎసిపి చంద్రకుమార్

**మలక్ పేట, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త:** వాహనదారులు సురక్షితంగా వాహనాలను నడపి తమ గమ్యస్థానాలకు చేరుకోవాలని చాంద్రాయణగుట్ట జోన్ ట్రాఫిక్ ఏసిపి వి.చంద్రకుమార్ పేర్కొన్నారు. మలక్ పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఇన్ స్పెక్టర్ రామకృష్ణ ఆధ్వర్యంలో దిల్‌షుక్ నగర్ లోని ఫైన్ ఇండియా పోలీస్ అకాడమీ సెంటర్ లో విద్యార్థులకు అరైవ్ , అలైవ్ కార్యక్రమాన్ని నిర్వహించి రోడ్డు భద్రత, ట్రాఫిక్ నియమ, నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ట్రాఫిక్ ఏసీపీ చంద్రకుమార్ మాట్లాడుతూ వాహనదారులుట్రాఫిక్ నియమ, నిబంధనలను పాటించాలని సూచించారు. ద్విచక్ర వాహనలను నడిపే వారితో పాటు పిలియన్ రైడర్ హెల్మెట్లను ధరించాలని పేర్కొన్నారు. అదేవిధంగా కార్లు నడిపేవారు సీట్ బెల్ట్ ను ధరించాలని కోరారు. జీబ్రా క్రాసింగ్ ల వినియోగం యొక్క ప్రాముఖ్యత గురించి తెలియజేశారు. ఎడమ వైపు నుంచి ఎట్టి పరిస్థితిలో ఓవర్టేకింగ్ చేయవద్దని పేర్కొన్నారు. ట్రాఫిక్ నియమ, నిబంధనల గురించి అవగాహన కల్పించారు. ఇన్ స్పెక్టర్ రామకృష్ణ మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాలు జరగకుండా ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని పేర్కొన్నారు.





విద్యార్థులకు ట్రాఫిక్ నియమ, నిబంధనలపై అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసిపి చంద్రకుమార్, చిత్రంలో మలక్ పేట ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ రామకృష్ణ తదితరులు

ట్రాఫిక్ నియమ, నిబంధనలపై విస్తృతంగా వాహనదారులకు అవగాహన కల్పిస్తున్నామని వివరించారు. మద్యం సేవించి వాహనాలను నడపవద్దని తెలిపారు. మొబైల్ ఫోన్ వినియోగం, రాంగ్ రూట్ డ్రైవింగ్, రెడ్ సిగ్నల్ జంపింగ్, అతి వేగం, ట్రిపుల్ రైడింగ్ వలన కలిగే ప్రమాదాల గురించి వివరించారు. పాదచారులు జీబ్రా లైన్స్ ఉపయోగించడం వలన కలిగే లాభాల గురించి తెలియజేశారు. ఈకార్యక్రమంలో మలక్ పేట ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ ఎస్.ఐలు రాము,వినోద్ కుమార్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో కాంట్రాక్టర్ల ఇష్టారాజ్యం ఇక చెల్లదు

-తూతూ మంత్రంగా ప్రారంభించి జాప్యం చేస్తే సహించేది లేదు
-సదరు కాంట్రాక్టర్లను అధికారులు బ్లాక్ లిస్ట్‌లో చేర్చాలి
-సీనియర్ కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** కాంగ్రెస్ ప్రభుత్వ పాలనలో బడంగ్‌పేట్ సర్కిల్‌లో తూతూ మంత్రంగా అభివృద్ధి పనులను ప్రారంభించి వాటిని పూర్తి చేయకుండా జాప్యం చేసే కాంట్రాక్టర్లను ఉపేక్షించేది లేదనీ అట్టి వారి పట్ల కఠిన చర్యలు తీసుకొని బ్లాక్ లిస్ట్‌లో పెట్టాలని సీనియర్ కాంగ్రెస్ నాయకుడు, కాంటెస్టెడ్ కార్పొరేటర్ నవారు మల్లారెడ్డి జిహెచ్ఎంసి అధికారులను కోరారు. సర్కిల్ పరిధిలోని నాదర్‌గుల్ డివిజన్ 57 కిందకు వచ్చే అల్మాస్‌గూడ ఆర్ఆర్ హిల్స్ కాలనీలో స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను బుధవారం ఆయన పరిశీలించారు. ఇందులో భాగంగా కాలనీ అసోసియేషన్ సభ్యులతో కలిసి ఆయన సమస్యలను క్షేత్ర స్థాయిలో పరిశీలన జరిపారు. ఈ సందర్భంగా సుమారు ఆరు నెలల క్రితం కాలనీలో మంజూరైన బిటి రోడ్లు వేయడానికి పనులు ప్రారంభించిన ఓ కాంట్రాక్టర్ రోడ్లను ఇష్టారాజ్యంగా తవ్వించి మొక్కుబడిగా కంకర వెట్ మిక్స్ పోసి చేతులు దులుపుకున్నారే తప్ప నేటికీ రోడ్లు పూర్తి చేయలేదని స్థానిక కాలనీవాసులు ఆయన దృష్టికి తెచ్చారు. దీంతో వాహనాల రాకపోకలకు ఇబ్బందికరంగా మారడమే కాకుండా కనీసం నడవడానికి కూడా రోడ్లపై ఇబ్బందులు కలుగుతున్నాయని వారు తెలిపారు. ఈ మేరకు స్పందించిన మల్లారెడ్డి మాట్లాడుతూ గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో మాదిరిగా కాంట్రాక్టర్లను వెనుకేసు



కాలనీలో కేవలం కంకర పోసి కాంట్రాక్టర్ వదిలేసిన రోడ్డును స్థానికులతో కలిసి పరిశీలిస్తున్న కాంగ్రెస్ నేత నవారు మల్లారెడ్డి

కొచ్చే ప్రసక్తే లేదనీ సిఎం రేవంత్‌రెడ్డి పాలనలో ప్రజాధనంతో చేసే అభివృద్ధి పనులను కచ్చితంగా కాంట్రాక్టర్లు సక్రమంగా చేయాల్సిందేనని స్పష్టం చేశారు. పనుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించే కాంట్రాక్టర్లపై తప్పకుండా చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను కోరారు. అనంతరం ఆయన కాలనీలో భూగర్భ డ్రైనేజీ, వీధి దీపాలు, పారిశుధ్య సమస్యలను పరిశీలించారు. కాలనీ సమస్యలను అదే విధంగా అసంపూర్తి రోడ్ల నిర్మాణం పూర్తి చేయించే విషయమై స్థానిక బడంగ్‌పేట్ సర్కిల్ డిప్యూటీ కమీషనర్ సరస్వతి దృష్టికి తీసుకెళ్తామని ఆయన వెల్లడించారు. సమస్యల పరిష్కారంలో జాప్యం జరిగితే మహేశ్వరం నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇంఛార్జి కెఎల్ఆర్‌ను కలిసి నివేదిస్తామని మల్లారెడ్డి కాలనీవాసులకు హామీనిచ్చారు. ఈ కార్యక్రమంలో కాలనీ సంఘం అధ్యక్షుడు కృష్ణారెడ్డి, తిరుపతిరెడ్డి, ముకుందం, శేఖర్, రాజశేఖర్‌రెడ్డి, కొండల్ పాల్గొన్నారు.

# నిధులు మంజూరైనా చెరువుల సుందరీకరణ పనుల్లో జాప్యం?

-పనులు నత్తనడకన సాగడంపై కారణాలు ఏంది?
-అభివృద్ధిలో పురోగతి కనిపించకుంటే సహించేది లేదు
-డిఇఇ వెంకన్నకు క్లాస్ తీసుకున్న మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** మహేశ్వరం నియోజకవర్గంలోని జిహెచ్ఎంసి శంషాబాద్ జోన్‌లో బడంగ్‌పేట్ సర్కిల్ పరిధి కిందకు వచ్చిన జిల్లెలగూడ, మీర్‌పేట్ డివిజన్లలో స్థానిక ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా చేపట్టిన చెరువుల సుందరీకరణ పనుల్లో జాప్యం జరుగు తుండడంపై స్థానిక ఎమ్మెల్యే, మాజీ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి తీవ్ర అసహనం వ్యక్తం చేశారు. నిధులు మంజూరై ఉన్నప్పటికీ అభివృద్ధి పనుల్లో అలసత్వం ఎందు కు చేస్తున్నారని ఆమె అధికారులను ప్రశ్నించారు. సుంద రీకరణ పనులు, ఇతర అభివృద్ధి పనులు నత్తనడకన సాగడానికి గల కారణాలపై ఆమె బడంగ్‌పేట్ సర్కిల్ డిఇఇ వెంకన్నను నిలదీశారు. అధికారులతో పాటు జిల్లెలగూడ, మీర్‌పేట్‌లకు చెందిన మాజీ కార్పొరేటర్లు, నాయకులతో కలిసి ఆమె చెరువులను సందర్శించారు. ఈ సందర్భంగా సంవత్సరాలు గడుస్తున్నా ఇంకా సుందరీకరణ, అభివృద్ధి పనులు పూర్తి కాకపోవడంపై ఆమె అసహనానికి గురయ్యారు. అయితే సాయంత్రం పూట వాకింగ్ చేస్తున్న వారిని పలుకరించిన సబితారెడ్డి వారికి ఎదురవుతున్న అసౌకర్యం, సమస్యలను అడిగి తెలుసుకొని చెరువుల సుందరీకరణ విషయంలో



డిఇఇ వెంకన్న తదితరులతో కలిసి చెరువుల సుందరీకరణ పనుల్లో జాప్యంపై పరిశీలన జరుపుతున్న సబితా ఇంద్రారెడ్డి

ఎలాంటి మార్పులు చేర్పులు ఉండాలో తెలుసుకున్నారు. అనంతరం ఆమె అధికారులతో మాట్లాడుతూ ఓ వైపు తాను ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేయిస్తుంటే మరో వైపు వాటిని త్వరిత గతిన పూర్తి చేయాల్సింది పోయి జాప్యం చేస్తుండడం తగదని హితవు పలికారు. తక్షణమే చెరువు సుందరీకరణ పనుల్లో పురోగతి కనిపించాలని ఆమె డిఇఇ వెంకన్నను ఆదేశించారు. ఇంకా నిర్లక్ష్యంగానీ మరే కారణంతో గానీ పట్టించుకోకపోతే సహించేది లేదని ఆమె స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎఇఇలు, వర్క్ ఇన్స్‌పెక్టర్లతో పాటు జిల్లెలగూడ, మీర్‌పేట్ మాజీ ప్రజాప్రతినిధులు, నాయకులు, మహిళా నాయకురాళ్లు తదితరులు పాల్గొన్నారు.

# కుమ్మెర ఘటన నిందితులను వెంటనే కఠినంగా శిక్షించాలి

**తుర్కయంజాల్ ఫిబ్రవరి 25,ప్రభాతవార్త** నాగర్ కర్నూల్ జిల్లా కుమ్మెర గ్రామంలో రెండు నెలల పసిబిడ్డను అత్యంత క్రూరంగా అమానవీయంగా కాలితో తన్ని హత్య చేసిన ఆ గ్రామ అగ్రకుల పెత్తందారులు శ్రీనివాస్ రెడ్డి మధుసూదన్ రెడ్డి సతీష్ రెడ్డి శ్రీకాంత్ రెడ్డి కన్నిరెడ్డి తుకారం రెడ్డి మరికొందరిపై ఎస్సీ ఎస్టీ అత్యాచార నిరోధక చట్టంతోపాటు హత్యా నేరం కింద కేసు నమోదు చేసి 8మంది హంతకులను 24 గంటల్లో తక్షణమే రిమాండ్ చేయాలని సీపీఎం పార్టీ తుర్కయాంజల్ మున్సిపల్ కమిటి ఆధ్వర్యంలో అంబేద్కర్ విగ్రహం వద్ద ధర్నా నిర్వహించారు. సీపీఎం జిల్లా కమిటీ సభ్యులు తుర్కయాంజల్ డివిజన్ కార్యాదర్శి డి.కిషన్ ,కేవీపీస్ జిల్లా కార్యదర్శి మస్కు ప్రకాశ్ కారత్ లు ప్రసంగించారు.పండగలు ఉత్సవాలలో కులవివక్ష అగ్రకుల దురహంకారంతో ప్రజల మధ్య కులవిద్వేషాలు సృష్టంచడం, దేవుడి దగ్గర అందరూ సమానము కాదని అహంకారము ప్రదర్శించడంవల్ల ఈ ఘటన జరిగిందన్నారు దేవుని దగ్గరికి వెళ్లడానికి 100 రూపాయలు ఫీజు ఎందుకు చెల్లించాలని ప్రశ్నించిన పాపానికి, చెల్లిస్తాం కానీ రషీదు ఇవ్వండని అడిగినందుకు సుమారు మూడున్నర గంటలపాటు గణేష్ అనే రజక యువకుడిని చితక బాధారని చెప్పారు. చివరికి ఏమాత్రం కనికరం లేకుండా అమానవీయంగా మానవ మృగంలా రెండు నెలల



పసిబిడ్డపై కూడా కాలితో తన్ని క్రూరంగా పసిబిడ్డను హత్యచేశారని చెప్పారు.బాధితులకు న్యాయంచేసే క్రమంలో నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని విమర్శించారు. డిఎస్పీ శ్రీనివాస్ ముందు హంతకులపై కేసు నమోదు చేయాల్సి ఉండగా బాధితులపై కేసు పెట్టారని చెప్పారు. సీఎం సొంత జిల్లాలో ఈ ఘటన జరిగితే ముఖ్యమంత్రి ఎందుకు మోనం పాటిస్తున్నారని విమర్శించారు తక్షణమే సీఎం నోరు విప్పాలని డిమాండ్ చేశారు తక్షణమే హత్యా నేరం కింద 103 సెక్షన్ పెట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం మున్సిపల్ కమిటీ సభ్యులు మండల సత్యనారాయణ, ఇల్లూరు భాస్కర్, పార్టీ నాయకు లు జె జ్యోతిబసు, ఆటో యూనియన్ నాయకులు రైతు వెంకటయ్య, బక్కయ్య, డేవిడ్, బుచ్చయ్య, స్వామి, రాఘవేంద్ర, సంజీవ, యాదమ్మ, లలిత, పార్వతమ్మ, సాలయ్య ఎకో సామి తదితరులు పాల్గొన్నారు

# పారిశుద్ధ్యంలో అలసత్వం వహిస్తే కఠిన చర్యలు

**- ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా**

**కుషాయిగూడ, ఫిబ్రవరి 25, ప్రభాతవార్త.** నగర పారిశుద్ధం, ప్రజల ఆరోగ్య రక్షణలో అధికారులు, సిబ్బంది ఎట్టి పరిస్థితుల్లోనూ నిర్లక్ష్యం వహించరాదని ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధికా గుప్తా స్పష్టం చేశారు. బుధవారం కాప్రా డివిజన్ పరిధిలోని సాధన విహార్ నాలా ప్రాంతం, జనప్రియ, వంపుగూడ, సాకేత్ కాలనీలలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. టౌన్ ప్లానింగ్ , శానిటేషన్ అధికారులతో కలిసి క్షేత్రస్థాయిలో పర్యటించిన ఆమె, స్థానిక సమస్యలను పరిశీలించారు. తనిఖీల్లో భాగంగా ప్రధాన రహదారులు, కాలనీల వెంట నిబంధనలకు విరుద్ధంగా వేసిన నిర్మాణ వ్యర్థాలనుకమిషనర్ గమనించారు. సర్కిల్ పరిధిలో అడ్డగోలుగా వ్యర్థాలను పారబోస్తున్న వారిని గుర్తించి, వాటిని వెంటనే తొలగించాలని ఆదేశించారు. బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అధికారులకు సూచించారు.పారిశుధ్య నిర్వహణలో భాగంగా కాలనీల్లో అక్కడక్కడా కనిపిస్తున్న గార్బేజ్ వల్నరబుల్ పాయింట్లను వెంటనే క్లియర్ చేయాలని రామ్కీ సంస్థ ప్రతినిధులను ఆదేశించారు. ప్రధాన రహదారులపై చెత్త పేరుకుపోకుండా నిరంతరం పర్యవేక్షించాలని, పారిశుద్ధ్య నిర్వహణలో అలసత్వం వహిస్తే సంబంధిత అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. తనిఖీల్లో కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి, ఉప్పల్ జోన్ టౌన్ ప్లానింగ్ డీసీపీ కృష్ణమోహన్, కాప్రా ఏసీపీ కృష్ణమూర్తి, ఇంజనీరింగ్ విభాగం ఏఈ స్రవంతి, డీఈ రవి, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ సానిటరీ సూపర్వైజర్ సుదర్శన్, రామ్కీ సర్కిల్ ఇంచార్జ్ నవీన్ కుమార్ రెడ్డి, జవాన్లు రామకృష్ణ, శ్రీనివాస్, ఎస్ఎఫ్ఐ వసంత, ఇన్చార్జి ఎస్ఎఫ్ఐ అంజలి లు పాల్గొన్నారు.



కాప్రాలో పర్యటించిన కమిషనర్ వినయ్ కృష్ణారెడ్డి, జోనల్ కమిషనర్

## ప్రశాంతిహిల్స్ ఫేజ్-4 సమస్యలు పరిష్కరించాలి : కృష్ణ యాదవ్



డివిజన్ ఏర్పాటైన తర్వాత తొలిసారిగా కాలనీలో పర్యటించిన శంషాబాద్ జోనల్ కమీషనర్‌కు జ్ఞాపికను అందజేస్తున్న ప్రశాంతిహిల్స్ ఫేజ్-4 అధ్యక్షుడు కృష్ణ యాదవ్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** జిహెచ్ఎంసి బడంగ్‌పేట్ సర్కిల్‌లోని ప్రశాంతిహిల్స్ డివిజన్ కిందకు వచ్చిన ప్రశాంతిహిల్స్ ఫేజ్-4 కాలనీ సమస్యలను పరిష్కరించాలని స్థానిక సంక్షేమ సంఘం అధ్యక్షుడు డి.కృష్ణ యాదవ్ శంషాబాద్ జోనల్ కమీషనర్ చంద్రకళను కోరారు. టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి, పలువురు అధికారులతో కలిసి డివిజన్‌లో పర్యటించిన ఆమెకు మాజీ కార్పొరేటర్ ముద్దా పవన్‌కుమార్ ఆధ్వర్యంలో కృష్ణతో పాటు పలువురు సభ్యులు, కాలనీవాసులు స్థానిక సమస్యలను ఆమెకు వివరించారు.ఈ సందర్భంగా కాలనీలో ఉన్న ఓపెన్ జిమ్ చుట్టూ గ్రిల్స్, స్థానిక పార్కులో హైమాస్ట్ లైట్లు, పార్కు చుట్టూ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు.ఈమేరకు సానుకూలంగా స్పందించిన జోనల్ కమీషనర్ తగిన చర్యలు తీసుకుంటానని హామీనిచ్చారు.అయితే కొత్త డివిజన్ ఏర్పాటైన తర్వాత తొలిసారిగా కాలనీకి వచ్చిన జోనల్ కమీషనర్ చంద్రకళకు కాలనీ సంఘం అధ్యక్షుడు కృష్ణ యాదవ్,కాలనీవాసులు ఘనస్వాగతం పలికారు.ఈసందర్భంగా ఆమెకు మర్యాదపూర్వకంగా జ్ఞాపికను అందజేసి సన్మానించారు.

## కుమ్మెరలో బాలిక హత్యోదంతంలో నిందితులను కఠినంగా శిక్షించాలి : ఎమ్మార్పీఎస్



ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు బొర్ర రవి, మస్కూరి సుధాకర్

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** నాగర్‌కర్నూల్ జిల్లా కుమ్మెరలో జరిగిన బాలిక హత్యోదంతంలో నిందితులపై హత్య కేసులు నమోదు చేసి బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని రంగారెడ్డి జిల్లా ఎమ్మార్పీఎస్ మాజీ అధికార ప్రతినిధి బొర్ర రవి మాదిగ, బాలాపూర్ మండల ఇంఛార్జి మస్కూరి సుధాకర్‌లు రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రభుత్వాలు మారుతున్నా బడుగు, బలహీన వర్గాల వారిపై అరాచకాలు ఆగడం లేదనీ ఇందుకు ఉదాహరణే కుమ్మెర ఉదంతమని వ్యాఖ్యానించారు. మల్లన్న ఆలయ దర్శనానికి వచ్చిన కుటుంబంలో రెండు నెలల చిన్నారిని అత్యంత పాశవికంగా అగ్ర వర్ణాల వారు కాళ్ళతో తొక్కి చంపడం దారుణమని వారన్నారు. కాంగ్రెస్ పాలనలో కూడా దాడులు ఆగకపోవడం శోచనీయమనీ ఇదే విధంగా ముున్ముందు జరిగితే ప్రజలే ప్రభుత్వంపై తిరగబడతారని వారు హెచ్చరించారు.

## అసెంబ్లీ ఇంఛార్జిలు ఇచ్చే పదవులు చెల్లవు : డిసిసి అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి

**సరూర్‌నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** రంగారెడ్డి జిల్లా పరిధిలోని అసెంబ్లీ నియోజకవర్గాల ఇంఛార్జిలుగా ఉన్న వారు ఎలాంటి పదవులు ఇవ్వడానికి వీల్లేదనీ ఒకవేళ ఎవరు ఇచ్చినా అట్టి పదవులు చెల్లవని డిసిసి అధ్యక్షుడు, టియుఎఫ్ఐడిసి ఛైర్మన్ చల్లా నర్సింహారెడ్డి వెల్లడించారు. ఈ మేరకు ఆయన ఓ ప్రకటన చేశారు. జిల్లా కిందకు వచ్చే నియోజకవర్గాల్లో డివిజన్లు, మండలాల కన్వీనర్ తదితర పదవులను ఇంఛార్జిలు ఇవ్వడానికి లేదని అన్నారు. పార్టీకి సంబంధించిన పదవులన్నీ టిపిసిసి అధ్యక్షుని అనుమతితో కేవలం డిసిసి అధ్యక్షుడు మాత్రమే ఉత్తర్వులు జారీ చేస్తారనీ అట్టి ఉత్తర్వులు మాత్రమే పార్టీ తరపున చెల్లుతాయని ఆయన స్పష్టం చేశారు. అసెంబ్లీ ఇంఛార్జిలు ఎవరు ఇచ్చిన అట్టి ఉత్తర్వులు గానీ పదవులు గానీ చెల్లవని ఆయన తేల్చి చెప్పారు.

## అధ్వాన్నంగా చిలుకానగర్ స్మశానవాటిక : కాంగ్రెస్



చిలుకానగర్ స్మశావనాటికను పరిశీలిస్తున్న కాంగ్రెస్ పార్టీ నేతలు ఆకటి ఆగంరెడ్డి, ముల్కపల్లి రాజేష్ ముదిరాజ్ తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** చిలుకానగర్‌లోని స్మశానవాటిక గత పాలకుల నిర్లక్ష్యం వల్ల అధ్వాన్నంగా మారిందని పలువురు కాంగ్రెస్ పార్టీ నేతలు ఆరోపించారు. ఈ మేరకు బుధవారం కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ మందముల పరమేశ్వర్‌రెడ్డి ఆదేశాల మేరకు పార్టీ ఇంచార్జీ ఆకిటి ఆగంరెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షుడు ముల్కపల్లి రాజేష్ ముదిరాజ్ తదితరులు స్మశానవాటికను పరిశీలించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో వారు మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో వైకుంఠధామంలో కనీస సౌకర్యాలు లేక ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. వైకుంఠధామంలో పిచ్చి మొక్కలు పెరిగి కనీస వసతులు లేవన్నారు. దీంతో దహన సంస్కారాలకు వచ్చే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆరోపించారు. స్మశానవాటిక అభివృద్ధికి కాంగ్రెస్ ఇంచార్జీ మందముల పరమేశ్వర్ రెడ్డి ప్రత్యేక చొరవ తీసుకుంటున్నారని, రాబోయే రోజుల్లో మౌళిక సదుపాయాలు కల్పించేందుకు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేతలు బజార్ జగన్ గౌడ్, కొంపల్లి బాలరాజు, నల్లవల్లి మహేందర్, గండికోట గణేష్, దండుగుల శంకర్, అమర్, కూరేలి యాదగిరి, కొండ్ర రాములు, రామ్‌చర్ల బలరాం, పల్నాటి కిష్టయ్య, పొడిశెట్టి కృష్ణ, భాస్కర్ రెడ్డి, పల్నాటి డేవిడ్, మారపాక సాయిలు, కిరణ్ పల్నాటి రమేష్, పగడం రాంనర్సయ్య, సంధ్య, గండికోట భరత్, మహేందర్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

## లక్ష్మిదేవి మరణం పట్ల మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ సంతాపం



బిజెపి సీనియర్ నేత చలపతిరాజు భార్య లక్ష్మిదేవికి నివాళులు అర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ తదితరులు

**రామంతాపూర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** భారతీయ జనతా పార్టీ రాష్ట్ర కార్యాలయంలో వివిధ హోదాలలో పనిచేసిన చలపతిరాజు భార్య లక్ష్మిదేవి అకాల మరణం వారి కుటుంబానికి తీరని లోటని మాజీ ఎమ్మెల్యే ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ పేర్కొన్నారు. ఈ మేరకు బుధవారం రామంతాపూర్ శ్రీనివాసపురం కాలనీలో లక్ష్మిదేవి పార్థివదేహాన్ని సందర్శించి నివాళులు అర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో ఎన్వీఎస్ఎస్ ప్రభాకర్ మాట్లాడుతూ చలపతి రాజు పార్టీ కోసం కష్టపడి చేశారని, అతని భార్య అకాల మరణం చెందడం దిగ్భాందికి గురిచేసిందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నేత వల్లపు జగన్ యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

## ఉప్పల్ సర్కిల్‌లో సర్‌పై జోనల్ కమిషనర్ సమీక్ష



ఉప్పల్‌లో స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పై జరిగిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, డిప్యూటీ కమిషనర్లు దృశ్యం.

**ఉప్పల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా బోగస్ ఓట్లు తొలగించేందుకు నిర్వహిస్తున్న స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ ( సర్) కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉప్పల్ సర్కిల్ కార్యాలయంలో జోనల్ కమిషనర్ రాధిక గుప్తా పలువురు డిప్యూటి కమిషనర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో కార్యక్రమంలో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, ఉప్పల్ డిప్యూటి కమిషనర్ జి. రాజు, కాప్రా డిప్యూటి కమిషనర్ కె. శ్రీహరి, నాచారం డిప్యూటి కమిషనర్ ఎస్.నిత్యానంద్, ఉప్పల్ మండలం తహసీల్దార్ ఎల్.ఫూల్ సింగ్ చౌహాన్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో జోనల్ కమిషనర్ రాధిక గుప్తా ఉప్పల్, కాప్రా, నాచారం ప్రాంతాలకు చెందిన బిఎల్ఓతో సమీక్ష నిర్వహించారు. ప్రభుత్వం ప్రత్యేకంగా అమలు చేస్తున్న సర్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సూచించారు. ఇంటంటికి తిరిగి సర్వే చేయాలని, బోగస్ ఓట్లు లేకుండా చూడాలని కోరారు. ఉప్పల్ నియోజకవర్గంలో స్పెసిఫిక్ ఇంటెన్సివ్ రివిజన్ వేగవంతం చేయాలని సూచించారు. ప్రతి ఒక్కరి ఫోటోలు ఉండే విధంగా చూడాలని,పకబ్బందీగా జాబితాల సవరణ చేపట్టాలని సూచించారు.కార్యక్రమంలో ఉప్పల్ నియోజకవర్గానికి పలువురు బూత్ లెవల్ ఆఫీసర్లు,ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## ఉప్పల్ జోనల్ పరిధిలో జెడ్‌సి రాధిక గుప్తా పర్యటన



పారిశుధ్య నిర్వహణ పరిశీలిస్తున్న ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా, కాప్రా డిసి కె.శ్రీహరి తదితరులు

**ఉప్పల్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త :** ఉప్పల్ జోన్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉప్పల్ జోనల్ కమిషనర్ రాధిక గుప్తా బుధవారం వివిధ ప్రాంతాల్లో సుడిగాలి పర్యటన నిర్వహించారు. ఉప్పల్, కాప్రా సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాల్లో పర్యటించి భవన నిర్మాణ అనుమతులు, అక్యుపెన్సీ సర్టిఫికేట్లు, పారిశుద్ధ్యం,నాలా పూడిక తీత పనులు పరిశీలించారు. ఉప్పల్, కాప్రా పరిధిలో నాలాలు పూడిత తీయాలని, ప్రజలకు ఇబ్బంది లేకుండా తగు చర్యలు చేపట్టాలని కోరారు. నిబంధనలకు విరుద్ధంగా భవన నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నాలాల పూడిక తీత వేగవంతం చేయాలని సూచించారు. పారిశుధ్య నిర్వహణలో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. ఉప్పల్ సర్కిల్ కార్యాలయం వెనుక వైపు పార్కింగ్ కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. తుక్కు వేలం వేసి చెత్తాచెదారం లేకుండా చూడాలని ఆదేశించారు. గడువు ముగిసిన సెల్ టవర్ తొలగించేందుకు అధికారులు సంబంధిత నిర్వహకులకు లేఖ రాయాలని నిర్ణయించారు. జోనల్ కార్యాలయానికి వచ్చే ప్రజలకు ప్రత్యేక పార్కింగ్ ఇతర సదుపాయాలు కల్పించాలని నిర్ణయించారు. ఈ కార్యక్రమంలో పలువురు అధికారులు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## విధి నిర్వహణలో నిర్లక్ష్యం ...బిల్ కలెక్టర్ సస్పెండ్

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న బిల్‌కలెక్టర్‌ను సస్పెండ్ చేశారు. ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్ బుధవారం ఎల్బీనగర్ సర్కిల్ కార్యాలయాన్ని సందర్శించారు. అనంతరం చంపాపేట ప్రాంతంలో ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. తనిఖీలలో భాగంగా ఎల్బీనగర్ సర్కిల్ పరిధిలోని చంపాపేట ప్రాంతం బిల్‌కలెక్టర్ సాయికిరణ్‌ను పలు అంశాల గురించి జోనల్ కమిషనర్ ప్రశ్నించారు. నోటీసులు సరిగా జారీ చేయకపోవడం, పన్నులు సరిగా వసూలు చేయకపోవడం, అసెస్మెంట్ సరిగా చేయకపోవడం తదితర అంశాలకు సంబంధించి నిర్లక్ష్యంగా వ్యవహరించాడని నిర్ధారణకు వచ్చిన జోనల్‌కమిషనర్ విధినిర్వాహణలో నిర్లక్ష్యం వహించిన కారణంగా బిల్‌కలెక్టర్ సాయికిరణ్‌ను సస్పెండ్ చేసినట్లు ఎల్బీనగర్ సర్కిల్ ఇంచార్జి డిప్యూటీకమిషనర్ బోనగిరి శ్రీనివాస్ తెలిపారు. అయితే రెవెన్యూ విభాగంలో చాలామంది అధికారులు మున్సిపల్ ఆదాయానికి గండికొట్టే విధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపణలు వెలువెత్తుతున్నాయి. మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ రెవెన్యూ విభాగం బాధ్యతలు నిర్వహిస్తున్న ఎల్బీనగర్ జోనల్ కమిషనర్ హేమంత్‌కేశవ్‌పాటిల్ రెవెన్యూ విభాగంపై కూడా ప్రత్యేక దృష్టి సారించారు. అందులో భాగంగా చంపాపేటలో నిర్వహించిన ఆకస్మిక తనిఖీలో సాయికిరణ్ విధినిర్వహణలో నిర్లక్ష్యం వహించడంతో అతన్ని సస్పెండ్ చేశారు. మూడు సర్కిల్ల పరిధిలో కూడా రెవెన్యూ విభాగం అధికారుల నిర్లక్ష్య ధోరణి కొనసాగుతోందని వారిపై కూడా దృష్టి సారించాలని పలువురు విజ్ఞప్తి చేస్తున్నారు.

## ప్రగతిశీల మహిళా దినోత్సవం పోస్టర్ ఆవిష్కరణ

**ఎల్.బి.నగర్, ఫిబ్రవరి 25 ప్రభాతవార్త:** అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జయచంద్రరెడ్డి చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రగతిశీల మహిళ సమ్మేళనం కార్యక్రమాన్ని మార్చి 3వ తేదీన నాగోల్‌లోని పీ.ఎం.ఆర్.గార్డెన్స్‌లో ఘనంగా నిర్వహిస్తున్నట్లు ఎల్బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్ ను బుధవారం ఎమ్మెల్యే ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ మహిళల సాధికారత, సమాన హక్కులు, విద్యా, ఉపాధి అవకాశాల విస్తరణకు కట్టుబడి ఉన్నామని తెలిపారు. సమాజ అభివృద్ధిలో మహిళల పాత్ర ఎంతో కీలకమని, వారి ప్రతిభను వెలికితీసి ప్రోత్సహించడం ప్రతిఒక్కరి బాధ్యత అన్నారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గ పరిధిలోని మహిళలు పార్టీలకు అతీతంగా భారీఎత్తున హాజరై విజయవంతం చేయాలని కోరారు. ఈ పోస్టర్ ఆవిష్కరణలో సీనియర్ మహిళా నాయకురాళ్లు పాల్గొన్నారు.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి